ప్రజాశక్తి సోపతి
డిసెంబర్ 21, 2014 ఆదివారం అనుబంధం



సరికొత్త ఫీచర్లతో 'జింప్'

ఏది 'నిర్భయ' భారతం?

- కథ: శీలమా? అదియేమి?
- శ్రీ శ్రీ సాంగ్ లాంగ్ మార్చ్ సమీక్ష
- వైవిధ్యభరితమైన కమ్మని గాత్రం
- నన్ను నేను విముక్తి చేసుకునేందుకే రాస్తాను: నెల్లీ సాచ్స్

గ్రామీణ జీవనమే కేంద్రం

గ్రామీణ జీవన సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాల్ని సృజించడంలో కాపు రాజయ్య (7 ఏప్రిల్ 1925– 20 ఆగస్టు 2012)ది విశిష్టమైన శైలి. మెదక్ జిల్లా సిద్ధిపేటకు చెందిన రాజయ్య చిన్నతనంలో గీయడం మొదలుపెట్టినప్పట్నించి చివరి శ్వాసవరకు బొమ్మలు గీస్తూ వచ్చారు. వారి బొమ్మలకు గ్రామం, ఆ గ్రామంలో శ్రమని ఆధారంగా చేసుకుని జీవించే వారే ఇతివృత్తాలు. తన నేల మీద నిలబడి జీవనం సాగిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనలకు బొమ్మలు పంపించారు. 1950 నుంచి 1970 వరకు నకాషి శైలిలో బొమ్మలు వేసిన రాజయ్యకు నకాషీ చిత్రకారులంటే ప్రత్యేక అభిమానం. వారి చిత్రాల్లో గ్రామీణ జీవితం, మహిళలు, వివిధ వృత్తుల్లో వున్న శ్రమజీవులు దర్శనమిస్తారు. జీవలక్షణం ఉట్టిపడే తత్వం రాజయ్య సొంతం. చిత్రకారునిగా గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించినప్పటికీ సిద్ధిపేటలో సైకిల్ మీద తిరుగుతూ పదిమందిని పలకరించేవారు. ఈయన బొమ్మల్లో బతుకమ్మ, వడ్డెర మహిళ, ఎల్లమ్మ జోగి, గోపికా కృష్ణ, వసంతకేళి, పంటపొలాలు, మొదలయిన చిత్రాలు ప్రసిద్ధి గాంచాయి. అనేక దేశాల్లో కాపు రాజయ్య సృజించిన చిత్రాలున్నాయి. దాదాపు యాభై అవార్డుల దాకా పొందిన రాజయ్య చిత్రకళా ప్రతిభ అసామాన్యమైంది. కళారత్న, కళా ప్రవీణ, కళావిభూషణ వంటి పురస్కారాలు అందుకున్నారు. వాటన్నిటి కన్నా మించి, చిత్రకళారంగాల్లో అనుపమానమైన ప్రతిభాశాలి కాపు రాజయ్య. వారు వేసిన వాటిలో కొన్ని బొమ్మలు ఇక్కడ చూడండి.



■ అంతరంగం

భాష

మానవ జీవితంలోని సకల అంశాల్ని రాజ్యం శాసిస్తుంది. భాష కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఎవరు ఏ భాషలో మాట్లాడాలో, ఏ భాషలో చదవాలో, ఏ భాషలో వ్యవహారాలు సాగించాలో పాలకులు నిర్ణయిస్తారు. అందుకే తమది కాని భాషలో మాట్లాడి, ఆ భాషనే తమ భాషగా అనుకునేంత భ్రమలకు లోనవుతారు మనుషులు. రాజ్యం ఎవరి పక్షాన వుంటే వారి భాషలదే పెత్తనమవుతుంది.

వర్గ సమాజంలో ఆధిపత్యవర్గాలే భాషని నిర్ణయిస్తాయి. అందువల్లనే దైనందిన వ్యవహారాల్లో ఒక భాషని వాడనప్పటికీ ఆ భాషను చదవడం అనివార్యమనే స్థితికి రాజ్యం లోను చేస్తుంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగే ప్రక్రియ. ఉదాహరణకు సంస్కృతం భాషనే తీసుకుంటే దాని వాడకం ఎంతో తెలిసిందే. తెలుగువారే కాదు ఇతర భాషల వారు కూడా తమ ఇళ్ళలో సంస్కృతంలో మాట్లాడరు. కానీ ఆ భాష నేర్చుకోవడం ద్వారా దేశ సంప్రదాయాల్ని, సంస్కృతుల్ని కాపాడుతామంటారు పాలకులు. వాడకంలో లేని భాషని సిలబస్‌లో తప్పనిసరి చేసినంత మాత్రాన భాష వస్తుందా? వచ్చినా నిలబడుతుందా?

సంస్కృతం అనేక భాషలకు మూలం. ఆ భాషల్లో మాట్లాడుతారే తప్ప సంస్కృతంలోనే నేరుగా మాట్లాడరు. వ్యవహార కార్యకలాపాలు కొనసాగించరు. అయినప్పటికీ సంస్కృతం చదివి దేశం మీద ప్రేమనీ, సంప్రదాయాల మీద అనురక్తిని ప్రకటించాలంటారు పాలకులు. ఒకవైపు తెలుగునాట మార్కుల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఇంటర్మీడియేట్ రెండేళ్ళపాటు సంస్కృతం చదవాలి. అయిదు నిమిషాలు కూడా సంస్కృతంలో మాట్లాడే సందర్భం పిల్లలకు రాదు. వచ్చినా మాట్లాడలేరు. కానీ నూటికి 80-90 శాతానికి పైగా మార్కులతో గట్టెక్కేస్తారు. ఆ రెండేళ్ళ కాలంలోనే కాదు జీవితంలో మరే సందర్భంలోనూ సంస్కృతం అవసరం పడదు వారికి. ఎందుకీ కపటత్వం? అవసరం లేని భాషతో కాలాన్ని వృధా పుచ్చడం ఎందుకు? ఈవిధంగా ఎవరూ ఎవరినీ ప్రశ్నించరు. అందువల్లనే భాష పేరుతో చెరలాట సాధారణమైంది.

సంస్కృతం గానీ, మరే భాష గానీ ఇష్టమైన వాళ్ళు చదువుకుంటారు. ఒక భాషగా సంస్కృతం గొప్పతనాన్ని ఎవరూ కాదనలేరు. ఆ భాషలో వచ్చిన అద్భుత సాహిత్యం చదువుకోడం అపురూప అనుభవం. సంస్కృతమే కాదు బెంగాలీ సాహిత్యాన్ని బెంగాలీలో, ఫ్రెంచి సాహిత్యాన్ని ఫ్రెంచ్‌లో చదువుకోవడంలోని అందం, ఆనందం భిన్నమైనవి. ఈ ఆసక్తి, ప్రేమ, తపనలున్న వారు వాటిని నేర్చుకుంటారు. కానీ అందరూ నేర్చుకోవాలనడం అసంగతం. అందుకే ఎవరు ఏ భాషలో చదువుతారన్నది వారి ఇష్టాలకు వదిలేయాలి. ముఖ్యంగా ప్రతి ఒక్కరికి తల్లిభాషలో చదువుకునే వీలు ఉండాలి. ఇతర భాషలు నేర్చుకోడానికి అవకాశాలు కల్పించాలి.

వెంటాడే వాక్యం

చేయలేని పనుల్ని మళ్ళీ మళ్ళీ గుర్తు తెచ్చుకోవడం ముసలితనం ఆవరించిందనడానికి గుర్తు.

ప్రజాశక్తి

సోపతి

డిసెంబర్ 21, 2014

లేఖలు 4

సంగీతం వైవిధ్యభరితమైన కమ్మని గాత్రం 5

కవర్‌స్టోరీ

ఏది 'నిర్భయ' భారతం? 6

కథ

శీలమా? అదియేమి? 10

ఆ పాత మధురాలు

శ్రీశ్రీ సాంగ్ - లాంగ్ మార్చ్ విశ్లేషణ 13

నెమలీక 14

సీరియల్ ప్రేమ - విప్లవం 16

సృజన

నన్ను నేను విముక్తి చేసుకునేందుకే రాస్తాను 18

నవరాగం ఎప్పుడయినా... సరదాగా... 20

ఆనంద జీవితంలో అద్భుత సత్యాలు 21

సోర్స్‌కోడ్ సరికొత్త ఫీచర్లతో 'జింప్' 22

ఆ సమస్యకు ఆదిలోనే చెక్ 23

సమీక్షలు

ఈ తరానికి అవసరమైన రచన 24

ఈ వారం కవిత్వం

అమూర్తుడు 26

'నిర్భయ భారతం' కలగా మిగిలి ఈ దేశంలో ఆడవాళ్ళపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్న తీరుతెన్నులపై విశ్లేషణే ఈ వారం ముఖచిత్రకథనం.

లేఖలు



రాత కనుమరుగైపోయింది

'చేతి రాతల సృజన కోణాలు' కవర్ స్టోరీలో ఎన్నో విషయాలు పొందుపరిచారు. స్కూలు, కాలేజీ చదువులు అయిపోయాక పరీక్షలు రాసే పని లేకపోయాక చేత్తో రాయడం అన్నది దాదాపుగా కనుమరుగైపోయినట్టే అనుకోవాలి. దానికి తోడు ఇప్పుడు విద్యార్థులకు కూడా ఆన్‌లైన్ పరీక్షలు పెడుతున్నారు. ఇక అక్కడ కూడా చేతి రాత కనిపించదు. ఉత్తరాలు, పోస్టు కార్డుల అడ్రస్ లేదు. ముందు ముందు స్కూలు పిల్లలకు కూడా చేత్తో రాసే పరీక్షలు పోయి కంప్యూటర్‌లో రాసే పరీక్షలు వస్తాయేమో అనిపిస్తుంది. ఒకసారి రాస్తే పది సార్లు చదివినట్లు అంటారు. అంటే రాతకు అంత శక్తి ఉంది. కానీ నేటి విద్యావిధానం బట్టీ పట్టించడానికే మొగ్గు చూపుతోంది. ఈ పద్ధతి మారితే బాగుంటుంది. **– సంతోష్ కుమార్, హైదరాబాద్**

మారిన కాలం

కాలం మారుతోంది. జీవన ప్రమాణాలూ మారుతున్నాయి. వాటితో పాటే మనుషుల మధ్య ఆత్మీయతలు, అనురాగాలు కూడా మారిపోతున్నాయి. చిన్నప్పుడు ఎంత ప్రాణంగా పెరిగిన వారైనా సరే పెద్దయిన తర్వాత పరిస్థితులతో పాటు తోబుట్టువుల మధ్య కూడా ప్రేమ, ఆప్యాతలు అవసరాన్ని బట్టి మారుతున్నాయి. ప్రపంచీకరణలో ప్రపంచమే ఓ కుగ్రామం అంటున్నారు. ప్రపంచం చిన్నదైపోయి, రాకపోకలకు దూరం, సమయం తగ్గుతుంటే... మనుషుల మధ్య బంధాలు, ఆప్యాయతలు మాత్రం పెరిగిపోతున్నాయి. ఇది నిజమనడానికి ఈ కథే ఉదాహరణగా ఉంది. **– సత్యప్రియ, నల్గొండ**

కత్తిమీద సాము

'మరపురాని అనుభవం'లో వి.హనుమంతరావు గారి వ్యాసం చివరి వరకు ఆసక్తిగా చదివాం. జర్నలిజంలో వృత్తి, అది కూడా రిపోర్టింగ్ ఫీల్డులో ఉన్నవారి పరిస్థితి కత్తిమీద సాములాంటిది అంటుంటారు. ఈ వ్యాసం చదివాక అది నిజమే అనిపించింది. అది కూడా యుద్ధ సమయంలో, సంబంధిత ప్రదేశాలకు విలేఖరిగా వెళ్లడం అక్కడి విశేషాలతో కూడిన సమాచారం తెలుసుకోవడం ఆనందంగా ఉంది.

– సత్యనారాయణ, హైదరాబాద్

అప్పటి ప్రాధాన్యత

అలనాటి పత్రికల సమాచారం బాగుంటోంది. సాహిత్య ప్రియులకు ఇలాంటి సమాచారం ఎంతో ఇష్టంగా ఉంటుంది. వీటి ద్వారా అప్పటి పరిస్థితులు తెలుసుకోడానికే కాకుండా అప్పట్లో ఎటువంటి వాటికి ప్రాధాన్యత ఉండేదో కూడా అర్థమయింది.

– విఘ్నేష్, పాలమూరు, మహబూబ్‌నగర్

డిమాండ్ పెరుగుతున్న లోహం

ప్లాటినమ్‌కు సంబంధించిన వివరాలు ఆసక్తిగా ఉన్నాయి. బంగారం కంటే అధిక రేటు పలికే ఈ లోహానికి రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోంది. చూడ్డానికి వెండిలా కనిపిస్తున్నా ఈ లోహం మెరుపు వేరు. అసలైన ప్లాటినమ్ నగలు కొనలేని వారికి ఇమిటేషన్ నగలు ఎటూ ఉండనే ఉన్నాయి. అయితే అంత రేటు పెట్టి కొన్నవారు నగల డిజైన్ మార్చుకోవాలనుకున్నప్పుడు బంగారం లాగా కరిగించి మళ్లీ కొత్త రకాలు తయారు చేయించుకునే వీలు ఈ లోహానికి ఉందా లేదా అనేది తెలియలేదు. ఇలాంటి మరికొన్ని విషయాలు కూడా ఈ వ్యాసంలో ఇస్తే బాగుండేది.

– విమల, కీసర, రంగారెడ్డి

మన జాతీయాలు

బాలెంత పులి

ఈనిన పులి అనటం కూడా కద్దు. పిల్లల్ని వదలి దూరంగా పోదు. ఆకలిగా ఉంటుంది. అందుబాటులోకి జంతవు వస్తే వేటాడుతుంది. చీమ చిటుక్కుమన్నా ఉలికి పడేటంత జాగ్రత్తగా ఉంటుంది బాలెంత పులి. పిల్లల కోడి కూడా ఎవరినీ నమ్మదు. మనుషుల్లో బాలెంత బలహీనంగా ఒకరి ఆశ్రయంలో వుంటుంది చేసే వారున్నందున. ఈనిన పులి వుంటే వేటకాండ్రు కూడా ఆ అడవికి పోవటానికి కూడా సాహసించరు. "కోడలు పసిద్ధయిందని (ప్రసూతి) పలుకరించటానికి నేను పోతే మా ఇయ్యపురాలు ఆర్నెల్ల నుంచి ఎట్లున్నది కోడలని చూశ్లేదు కాని ఇప్పుడు మనుమడు పుట్టిండని అచ్చినావు అని బాలింత పులి తీరు మీద మీద పడ్డది" అనటంలో ఈ జాతీయం ప్రస్తావన వుంది.

తుట్టిలో బాగోతం

తుట్టి అంటే నష్టం. భాగవతులు గ్రామంలో ప్రదర్శన ఇవ్వటానికి వస్తారు. కులాలవారీగా అందరిని కలిపి ప్రదర్శనకు ఏర్పాట్లు చేసుకుంటారు. గ్రామంలో గొప్ప గొప్పవారు తాము ఒంటరిగానే ప్రదర్శనకు వ్యయం భరిస్తారు. లక్షాధికారిగా వున్న ఒక వ్యాపారి నష్టపోయాడు. అయినా ఔదార్యవంతుడు. ఏటా వచ్చి అడిగే ఆనవాయితీ ప్రకారం సాహుకారును ప్రదర్శన కోసం భాగవతులు అర్థించారు. తన నష్టం గురించి లెక్కచేయక నష్టంలో ఇంకింత నష్టం అనే ఔదార్యంతో ప్రదర్శనకు తగు ధనం ప్రసాదించాడు. గ్రామస్తులు అతని దీనస్థితి నెరిగినవారు ఆశ్చర్యపోయారు. ఔదార్యానికి దరిద్రం లేదనుట. వ్యాపారనష్టం వల్ల ధనం పోయింది. దరిద్రం వచ్చింది. దరిద్రంలో భాగవత ప్రదర్శన చేస్తే ప్రజల్లో సానుభూతి పెరుగుతుంది. "బీటుకు (మార్కెటు) పోయే వరకు మక్కలు (మొక్కజొన్నలు) పల్లాకు నూరు రూపాయలు ధర దిగినవి. తుట్లె భాగోతంలా మక్కలన్నీ గోదాంలో వుంచి మళ్ళీ దిగిన ధరకు ఇమ్మడి మక్కలు కొన్నాను" అనటంలో ఈ జాతీయం ప్రయోగం చూడొచ్చు.

దోసకాయ మూతి

దోసకాయల్లో పునాస దోస, వేసంగి దోస, రేగడి దోస, కూరదోస రకాలుంటాయి. మఖ, పుబ్బ, ఉత్తర, హస్తకార్తెల్లో లభించే దోసకాయ తీయగా, నీరు నిండి, చల్లగా ఉంటుంది. కాని మూతి మాత్రం చేదుగా వుంటుంది. మూగి భాగం అంగుళం వరకు వదిలి దోసకాయ తింటారు. మనిషి మంచిగా కనిపించి ఆకారపుష్టి కలిగి నోటి దురుసుతనం వున్నవారిని దోసకాయ మూతి వాడంటారు. "మనవాడని నమ్మితే వెనకా ముందు చూడకుండా మా అందరివైపున మాట్లాడటానికి పోయి దోసకాయ మూతి చేదన్నట్లు సేటును నోటి కొచ్చినంత తిట్టి ఆయనకు కోపం తెప్పించాడు, పని చెడిపోయింది" అనటంలో ఈ జాతీయం ప్రయోగం కనిపిస్తుంది.

– వేముల పెరుమాళ్ళు

■ సంగీతం

వైవిధ్యభరితమైన కమ్మని గాత్రం

నటిగా, దర్శకురాలిగా, గాయనిగా, రచయితగా, నిర్మాత, సంగీత దర్శకురాలిగా... ఇలా ఎన్నో కళల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి అనిపించుకున్న నటి భానుమతి. అప్పట్లో ఆమెతో నటించాలని అగ్ర నాయకులే కలలు కనేవారంటే ఆమెలో ఎంతటి ప్రతిభ వుందో అర్థం చేసుకోవచ్చు. ఆత్మ విశ్వాసానికి, ఆత్మ గౌరవానికి ప్రతీకలా ఉంటుంది ఆమె. మూర్తీభవించిన విజయం అంటే ఆమే గుర్తొస్తుంది. చిత్ర సీమలో నిలిచి, గెలిచిన మహిళలలో మొదట భానుమతి పేరే చెప్తారు ఇప్పటికీ. 'వర విక్రయం' చిత్రంతో తెరంగ్రేటం చేసిన భానుమతి అసామాన్యమైన నటనతో ఎన్నో జాతీయ అవార్డులను తన ఖాతాలో వేసుకుని తనకు తానే సాటి అనిపించుకున్నారు. ఆమె గాత్రంలో మాధుర్యం, వైవిధ్యంతో పాటు

పొగరు, వగరు కూడా అందంగానే ఉంటుంది.

ఎన్టీఆర్, ఎస్వీఆర్, భానుమతి నటించిన 'బొబ్బిలి యుద్ధం' చిత్రంలో "శ్రీకర కరునాల వాల వేణుగోపాలా... సిరులు యశము శోభిల దీవించు మమ్ములా" అంటూ తన కొడుకు కాకతీయ వైభవం, హంపి ప్రాభవం, తెలుగుజాతి కీర్తి పెంచేట్లుగా తయారవ్వాలని దీవిస్తూ పాడుతుంది భానుమతి.

'అంతా మన మంచికే' చిత్రంలో దాశరథి సాహిత్యమందించిన "నేనె రాధనోయి గోపాల... నేనే రాధనోయి.. అందమైన ఈ బృందావనిలో" పాటకు సత్యం సంగీతం సమకూర్చారు. ఈ సినిమాలోదే మరో పాట "సరిగమపా.. పాట పాడాలి, పాటలోనే పాఠాలన్నీ నేర్చుకోవాలి" పాటకు ఆరుద్ర సాహిత్యమందించారు. పిల్లలంతా ఒకటిగా ఉండాలని, పాఠాలు చక్కగా చదువుకుని జీవితానికి పూల బాట ఏర్పరచుకోవాలని చిన్నారులకు ఆడుతూ పాడుతూ చెప్తుంది భానుమతి.

'బాటసారి' చిత్రంలో సముద్రాల సాహిత్యానికి మాస్టర్ వేణు సంగీతం అందించిన పాట "ఓ బాటసారి నను మరువకోయీ, మజిలీ ఏదైనా మనుమా సుఖాన". బాటసారిగా వచ్చి ఆశ్రయం పొందిన వ్యక్తిమీద అభిమానం ఏర్పరచుకుని, అతను తిరిగి వెళ్లేటప్పుడు తనను మర్చిపోవద్దని ఆలపిస్తుంది భానుమతి.

'అంతస్థులు' చిత్రంలో కొసరాజు రాఘవయ్య చౌదరి రాసిన పాటకు కె.వి.మహదేవన్ సంగీతం అందించారు. ఆడపిల్ల ఒంటరిగా బయట కనిపిస్తే చాలు ఆకతాయిలు, పోకిరీలు, పోరంబోకులు ఏడిపించడానికి తయారుగా ఉంటారు. అలాంటి వారికి ఎలా బుద్ధి చెప్పాలో చెప్పే పాట "దులపర బుల్లోడో దుమ్ము దులపర బుల్లోడ, చిలిపి కళ్లతో షికార్లు కొట్టే మలప రాములను పిలక బట్టుకుని". ఇదే చిత్రంలోనిదే ఆరుద్ర రాసిన "వినరా విస్సన్న నే వేదం చెపుతా వినరన్నా" అనేది మరో పాట. నీరు విడిచి చేప బతికుండనట్టే, నీతి విడిచిన మనిషికి పరువుండదని చెప్పే పాట ఇది.

'చండీరాణి' చిత్రంలో " ఓ తారకా.. ఓ జాబిలి నవ్వులేలా... అందాలు చిందెడీ చందమామ నీవనీ" అంటూ ఎన్టీఆర్‌తో యుగళగీతాలూ పాడింది భానుమతి.

'విచిత్ర వివాహం' చిత్రంలో "అమ్మాయిలూ... అబ్బాయిలూ... నా మాటలో నిజం వింటారా మీరు" పాటలో ఫ్యాషన్, ప్రేమ పేరుతో మాయ మాటలకు పోసపోయి, నాగరికత పేరుతో నవ్వుల పాలవుతున్నారు నేటి యుక్త వయసు ఉన్నవారు, దారి తప్పి పోవద్దంటూ భానుమతి పాడే పాటలో ఎంతో వాస్తవముందని నేటికీ ఒప్పుకోక తప్పదు.

సినీ చరిత్రలో భానుమతి పేరును చిరస్థాయిగా నిలిపిన చిత్రం 'మల్లీశ్వరి'. ఈ చిత్రంలో పాటలన్నీ ఇప్పటికీ మర్చిపోకుండా వింటున్నారంటే ఆ గొప్పదనం దేవులపల్లి కృష్ణశాస్త్రి కవితాత్మక పదాలకు సాలూరి రాజేశ్వరరావు స్వరకల్పన తోడై భానుమతి గాత్రంతో పరిపూర్ణమైందనే చెప్పాలి. అందులో పాటలు "పిలిచినా బిగువటరా ఔరౌరా, ఔనా! నిజమేనా! మరతునన్నా మరువలేను, పరుగులు తీయాలి, గిత్తలు ఉరకలు వేయాలి, నోమిన మల్లాల నోమన్నలాల, మనసున మల్లెల మాలలూగెనే, ఎవరు ఏమని అందురు, ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు, ఎన్నినాళ్లకీ బతుకు పండెనో ఎంత హాయి ఈ రేయి నిండెనో, ప్రేమే నేరమౌనా.. మాపై ఈ పగేలా.. వేదనగానే మా వలపంతా వేసారునా, ఎందుకే నీకింత తొందరా"... ఇలా తన పాత్రకున్న అన్ని పాటలు భానుమతే పాడుకున్నారు.

'స్వర్గసీమ' చిత్రంలో స్వయంగా స్వరపరచి పాడిన పాట "ఓహోహో పావురమా". 'మట్టిలో మాణిక్యం' చిత్రంలో "శరణం నీ దివ్య చరణం... నీ నామమెంతో మధురం, నీవే రా నా మదిలో", 'మంగమ్మగారి మనవడు' చిత్రంలో "శ్రీ సూర్య నారాయణా మేలుకో.. మా చిలకమ్మ బులపాటమూ చూసిపో.. తెల్లవారకముందే ఇల్లంతా ముగ్గులు", 'చామంతి' చిత్రంలో "చామంతి పువ్వా..." ఇలా ఆమె ఏ చిత్రంలో నటించినా, తన పాత్రకు పాట ఉన్నట్లయితే తనే పాడుకునేవారు తప్పితే మరొకరితో పాడనిచ్చేవారు కాదు. ఆమె కమ్మటి స్వరం, ఆకట్టుకునే నటన మనం ఇప్పుడే కాదు, ఎప్పటికీ మర్చిపోలేం.

- బి.మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ

ఏది 'నిర్భయ' భారతం?

మనం జీవిస్తున్నది నాగరిక సమాజంలోనే... కాని సాటి మనుషుల్ని క్రూరంగా హింసించే అనాగరిక భావనలు ఇంకా సమాజాన్ని వీడిపోలేదు. ఇందులో మహిళలపై పెరుగుతున్న హింస ప్రధానమైనది. సాధారణ మహిళలపై మాత్రమే కాదు... ఉన్నత చదువులు చదివిన వారు, మంచి ఉద్యోగాల్లో ఉన్న మహిళలు, ఇలా పసిపిల్లల దగ్గర నుండి పండు ముసలి వరకు బాధితులే. అసలు మానవ సంబంధాలు ఇంత హీనంగా ఎందుకు దిగజారుతున్నాయి? మనిషి పట్ల తోటి మనిషికి ఉండాల్సిన మానవ సంబంధం ఎందుకు మృగ వాంఛగా మారుతోంది? ఇలాంటి సంఘటనలు నిత్యం జరగడానికి కారణం ఏమిటి? నేటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులే కారణమా? లేక వ్యక్తుల్లోని మానసిక బలహీనతలే ఇలాంటి చర్యలకు కారణమా అనేది ఆలోచిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు.

ఢిల్లీలో ఉబెర్ క్యాబ్‌లో రాత్రి 9గంటలకు ఎక్కిన అమ్మాయిపై డ్రైవర్ అత్యాచారం...

నల్గొండలో పని కోసం వెళ్ళిన గిరిజన మహిళలపై అత్యాచారం...

రంగారెడ్డి జిల్లాలో వైద్యం కోసం వెళ్ళిన అమ్మాయికి మత్తు మందు ఇచ్చి అమ్మాయిపై అత్యాచారం చేశాడు డాక్టర్...

హైదరాబాద్‌లో స్నేక్‌గ్యాంగ్ పేరుతో కొంతమంది మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు.

మెదక్‌లో దళిత కుటుంబానికి చెందిన ఒంటరి మహిళపై అగ్రకులానికి చెందిన వారు అత్యాచారం చేసే ప్రయత్నం చేశారు. ప్రతిఘటించిన పాపానికి తన ఇంట్లోనే సజీవదహనం చేశారు.

ఇలాంటి ఘటనలు నిత్యం వింటుంటే... ఇంటి నుంచి బయటికి వెళ్లిన అమ్మాయి క్షేమంగా తిరిగి వస్తుందన్న నమ్మకం లేదు. దారిలో ఎక్కడ ఏ అపాయం పొంచి ఉందో ఊహించలేని పరిస్థితి. నిర్భయ చట్టం రావడం వల్ల ఇక దేశంలో మహిళలపై నేరాలు తగ్గుముఖం పడతాయి అని భావించినప్పటికీ అదేమీ జరగకపోగా నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ చట్టాలను అపహాస్యం చేస్తున్నాయి. నిర్భయ చట్టం అమలులోకి వచ్చిన మరుసటి రోజే మన రాష్ట్రంతో సహా దేశ వ్యాప్తంగా 50 మంది మహిళలు అత్యాచారానికి గురైనట్లు అనేక రిపోర్టులు చెబుతున్నాయి.

భారతదేశంలో ప్రతి గంటకు ఇద్దరు మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని జాతీయ నేర పరిశోధన గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి 26 నిమిషాలకు ఒక మహిళ వేధింపులకు గురవుతుంది. ప్రతి 34 నిమిషాలకు ఒక మహిళపై అత్యాచారం జరుగుతోంది. ప్రతి 42 నిమిషాలకు ఒక మహిళపై లైంగిక వేధింపులు, వరకట్నం కోసం ప్రతి 99 నిమిషాలకు ఒక వధువు బలవుతోంది. 2013లో దేశ వ్యాప్తంగా మహిళలపై 3,09,546 నేరాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోఎక్కువ నేరాలు (32,809) జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదే 2012లో 2,44,270 నేరాలు. అంటే 26.7 శాతం నేరాలు పెరిగాయి. వీటిని బట్టి చూస్తే ప్రతి ఏటా నేరాల సంఖ్య పెరుగుతూనే ఉంది. దేశవ్యాప్తంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో 369 మంది ఎం.పిలు. ఎం.ఎల్.ఏలపై అత్యాచార కేసులు నమోదైనట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

అత్యాచారాలు, అపహరణలు, వరకట్న వేధింపులు, అమ్మాయిల అక్రమ రవాణా ఇలా అనేక విధాలుగా మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. చిన్నారులు, యువతులు, మహిళలపై నగరాలు, పట్టణాలతో సహా చివరికి గ్రామాల్లో సైతం విచక్షణరహితంగా దాడులు జరుగుతున్నాయి. వీటన్నింటిని చూస్తుంటే స్త్రీల పట్ల పురుషాధిక్య సమాజంలో, భావజాలంలో మార్పు

రాకుండా ఎన్ని చట్టాలు ఉన్నా మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టలేమని జరుగుతున్న సంఘటనలు, గణాంకాలు రుజువు చేస్తున్నాయి.

పసిపిల్లలకూ రక్షణ కరువు

నల్గొండ జిల్లాలో11మంది గిరిజన బాలికలపై ట్యూటర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న విద్యార్థి రెండోతరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికి చెప్పొద్దని చెప్పి ఆ అమ్మాయిపై రోజూ లైంగిక దాడికి పాల్పడుతూ ఫోనులో చిత్రీకరించాడు. దీన్ని తన స్నేహితులకు చూపించడం ద్వారా వెలుగులోకి వచ్చింది. మరొక ఘటన ఇద్దరు ఆడపిల్లల తల్లి భర్త చనిపోవడంతో మరో పెళ్ళి చేసుకుంది. అతను ఆమె పెద్దకూతురిపై రోజూ అత్యాచారం చేసేవాడు. ఈ విషయం అమ్మాయి తల్లికి తెలిసినా పరువుపోతుందని ఎవరికీ చెప్పలేదు. చివరికి రెండో కుతూరిపై కూడా అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. ఈ అమ్మాయి తన స్కూల్ ప్రిన్సిపాల్‌కు తెలియజేయడంతో ఈ ఘటన బయటికి వచ్చింది. పాఠశాలలో పిల్లలను వేధిస్తున్నారనే విషయం తెలిసి వెళ్ళిన బాలల హక్కుల సంఘానికి ఒక కీచక టీచర్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని పిల్లలు చెప్పారు. ఆఖరికి తండ్రి కూడా కూతురిపై అత్యాచారం చేస్తున్నాడు. ఇవే కాక ఇంకా ఎన్నో దేశం మొత్తం మీద కూడా జరుగుతున్నాయి. ఢిల్లీలో ఓ స్కూల్లో తనను తీసుకెళ్లడానికి వచ్చే తండ్రి కోసం వేచిచూస్తున్న చిన్నారిపై 23ఏళ్ళ అటెండర్ అత్యాచారం చేశాడు. ప్రకాశం జిల్లా మిషనరీ హాస్టల్‌లో ఆరేళ్ళ బాలికపై అత్యాచారం. ఢిల్లీలో ప్లే స్కూలు యాజమాని కుమారుడు చిన్నారిపై అత్యాచారం చేశాడు. ఎనిమిదేళ్ళ బాలికపై వాచ్‌మెన్ అత్యాచారం, బెంగుళూరులో పాఠశాల ఉద్యోగుల చేతిలో ఆరేళ్ళ బాలిక అత్యాచారానికి గురైనది. కోల్‌కతాలో ఓ పాఠశాల వేడుక కోసం ప్రాక్టీసు చేస్తున్న చిన్నారిపై వేధింపులు సాగాయి.

ఇలా చిన్న పిల్లలపై లైంగిక దాడుల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నాల్గవ స్థానంలో ఉందని ఏసియన్ హ్యూమన్ రైట్స్ సంస్థ విడుదల చేసిన ఓ నివేదికలో వెల్లడైంది. 2001-2011 మధ్య బాలలపై అత్యాచారాలకు సంబంధించి, 3,977 కేసులు నమోదు కాగా, 2012లో మాత్రమే 613 మంది బాలలు రాష్ట్రంలో అత్యాచారం బారిన పడ్డారు. చదువు చెప్పాల్సిన పాఠశాలల్లో, ట్యూషన్లలో కూడా బాలలకు రక్షణ లేకుండా పోతోంది. ఇలాంటి సమయాల్లో తల్లిదండ్రులు పరువుపోతుందని ఫిర్యాదు చేయడానికి తటపటాయిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా గత సంవత్సరం 24,003 అత్యాచార సంఘటనలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే అత్యాచార బాధితుల్లో 30శాతం మంది పసిపిల్లలు ఉంటున్నారు. ఒక మన రాష్ట్రంలో గత సంవత్సరం 1442 అత్యాచార కేసులు నమోదయితే వాటిల్లో 646 మంది పసిపిల్లలు అంటే దాదాపు 44.7శాతం అత్యాచారాలు చిన్న పిల్లలపై, బాలికలపై జరుగుతున్నట్లు తెలుస్తోంది. మమతాబెనర్జీ గారి రాష్ట్రంలో గత సంవత్సరం మొత్తం 2363 మందిపై అత్యాచారాలు జరిగితే వాటిలో మైనారిటీ తీరని వారు 345 మంది పసిపిల్లలు ఉన్నారని జాతీయ నేర పరిశోధన విభాగం చెబుతుంది.

సభ్యసమాజం తలదించుకునేలా జరుగుతున్న ఇలాంటి సంఘటనలను చూస్తుంటే మన పాఠశాలలు, ఇల్లు, బయట ప్రదేశాలు రోజురోజుకూ ఎంత అభద్రతగా మారుతున్నాయో తెలుస్తోంది. అందుకే పిల్లలు తమలో ఉన్న భావాలను నిర్భయంగా చెప్పగలిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి. పిల్లలకు ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించాలి. వీటి గురించి చర్చించేటప్పుడు సిగ్గుపడకుండా అన్ని సబ్జెక్టులలాగానే బోధించాలి. అప్పుడే వారికి అవగాహన కల్పించినవారమవుతాం.

ఉద్యోగినులపైనే నేరాలు ఎక్కువ

హైదరాబాద్‌లో మియాపూర్‌లో క్యాబ్ ఎక్కిన అమ్మాయిని అమీర్‌పేట్‌లో ఆ క్యాబ్‌లోకి డ్రైవర్ స్నేహితుడంటూ ఇంకొకరు ఎక్కారు. వారు ఆమెపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించగా వారి నుండి తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఢిల్లీ ఉబెర్ క్యాబ్ ఘటన, ఇఫ్లూ విశ్వవిద్యాలయంలో అమ్మాయిపై అత్యాచారం, తెహల్కా ఎడిటర్ తన సహోద్యోగినిపై అత్యాచారం చేసే ప్రయత్నం చేశాడు. ముంబాయిలోని పాత శక్తిమీల్స్ దగ్గర ఫోటో జర్నలిస్ట్‌పై సామూహిక అత్యాచారం. ఇది నిర్భయ ఘటన తరహాలోనే జరిగింది. ఇలాంటి ఘటనలు బయటకు రానివి కూడా ఎన్నో ఉన్నాయి.

దేశంలోని మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు, హైదరాబాద్, కోల్‌కతలలో ఉద్యోగినులపై నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని అసోచామ్ జరిపిన సర్వేలో వెల్లడైంది. విధులకు వెళ్లి వచ్చేటప్పుడు తమకు రక్షణలేదని ఉద్యోగినులు వెల్లడించారని ఈ సర్వేలో పాల్గొన్న 92శాతం మంది మహిళలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా బిపివో, ఐటి రంగాల్లో, పౌరవిమానయానం, నర్సింగ్ హోమ్స్, హాస్పిటాలిటీ లలో పనిచేస్తున్న మహిళలు తమకు తగిన రక్షణ లేదని చెబుతున్నారు. ఆటోలు, క్యాబ్‌లు కూడా సురక్షితం కాదు అమ్మాయిలకి. ఉబెర్ క్యాబ్ ఘటనే తీసుకుంటే ఈ డ్రైవర్‌కి ఇది కొత్త కాదు. ఇలాంటి కేసులు ఎన్నో అతనిపై ఉన్నాయి. ఇలాంటి కేసులు ఉన్న వ్యక్తిని డ్రైవర్లుగా అనుమతివ్వరాదని చట్టాలు చెబుతున్నాయి. కాని ఆ చట్టాలనే చుట్టాలుగా చేసుకొని అనుమతులను తెచ్చుకుంటున్నారు. చట్టాలు కూడా చుట్టాలుగా మారుతున్న ఈ పరిస్థితుల్లో ఇక మహిళలను రక్షించే చర్యలు ఎలా తీసుకుంటారు.

వీటికి తోడు ఘటనలు జరిగినప్పుడల్లా రాజకీయనాయకులు చేస్తున్న దురుసు వ్యాఖ్యలు పుండు మీద కారం చల్లినట్లుగా ఉంటున్నాయి. పురుషాధిక్య సమాజంలో మహిళలను ఇంకా దిగజారే ప్రయత్నాల్లో భాగమే ఈ వ్యాఖ్యానాలు.

నోటి దురుసు వ్యాఖ్యలు

"అబ్బాయిలు అబ్బాయిలే. వారు తప్పు చేస్తారు. అంతమాత్రానికే వారిని ఉరితీయడం సబబా" ఇవి సమాజ్ వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ మాట్లాడిన మాటలు. అంతటితోనే ఆగకుండా "2012లో ఢిల్లీ నగరంలో నిర్భయ అత్యాచారానికి, హత్యకు గురైన అనంతరం వచ్చిన కొత్త అత్యాచార చట్టాలను దుర్వినియోగం చేస్తూ తమ బాయ్ ఫ్రెండ్స్‌ను శిక్షించడానికి ఉపయోగిస్తున్నారని వ్యాఖ్యానించాడు. వారి స్నేహం ముగిసిపోయినపుడు తాను అత్యాచారానికి గురయ్యానని అమ్మాయి ఫిర్యాదు చేస్తుందని" మహిళలపై ఘోరమైన నిందారోపణ చేశాడు. ములాయం సింగ్‌కు మహిళల పట్ల ఉన్న అభిప్రాయం ఇదైతే, ఆయన అనుచరుడు అసీమ్ అజ్మీ ముంబాయ్ వార్త పత్రికతో మాట్లాడుతూ "ఏ మహిళ అయినా సరే, కోరి వెళ్ళినా... తన

ఆచరణలో పెట్టాలి

ఇంటా బయటా అనేక రకాలుగా హింసను ఎదుర్కొంటున్నారు మహిళలు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలపై జరుగుతున్న హింసపై కమిటీ వేసి అన్ని రంగాలను కలిసి రిపోర్టును తయారు చేశారు. ఎన్నో అంశాలతో కూడిన ఈ రిపోర్టును ఆచరణలో మాత్రం పెట్టలేదు. షీ టీమ్స్ వేశారు. కొన్ని చోట్ల పట్టుకుంటున్నారు. హెల్ప్‌లైన్ ఇస్తామన్నారు. కాని ఇప్పటివరకు దాని ఊసేలేదు. నిర్భయ చట్టం, పోస్కో చట్టం, గృహ హింస చట్టం, పని ప్రదేశాలలో లైంగిక నిరోధక చట్టం ఇలా మంచి ఎఫెక్టివ్ చట్టాలున్నా వాటి గురించి ఎంతమందికి తెలుసు. మేము ఈ మధ్యకాలంలో కాలేజీలలో కొన్ని కార్యక్రమాలను తీసుకున్నాం. ఆ సమయంలో ఈ చట్టాల గురించి చెబితే అవునా! ఇన్ని చట్టాలు ఉన్నాయా? వీటి గురించి చెప్పండి? అంటూ అడిగారు. అంటే ఉన్న చట్టాల గురించి కూడా తెలియని పరిస్థితుల్లో మనం ఉన్నాం. అంతేకాక, మహిళా కమీషన్ నిద్రాణస్థితిలో ఉంది. ఇన్ని ఘోరాలు జరుగుతున్నా వాటి గురించి కనీస సమాచార సేకరణ కూడా చేయడం లేదు. అయినా ఈ ప్రభుత్వం మహిళలను పట్టించుకునే స్థితిలో లేదు. ఒక్క మహిళా మంత్రిని కూడా నియమించలేని ప్రభుత్వం ఇక భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటుంది. కాబట్టి ప్రభుత్వాలు చేసిన రిపోర్టు ఆధారంగా దాన్ని ఆచరణలో పెట్టి, చట్టాల గురించి అవగాహన కల్పించినప్పుడే మార్పు కొంతవరకైనా జరుగుతుంది.

– కొండవీటి సత్యవతి, కో అర్డినేటర్, భూమిక హెల్ప్‌లైన్

సమ్మతి లేకపోయినా సరే ఒక పురుషునితో వెళితే గనుక ఆమెను ఉరితీయాలి" అని వ్యాఖ్యానించాడు. వీరే కాదు, ఇంకా ఎంతోమంది రాజకీయవేత్తలు ఇంకా ఎంతో ఘోరంగా మాట్లాడుతున్నారు. "స్కూల్ అమ్మాయిలు గౌనులు వేసుకుంటున్నందున వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని" రాజస్థాన్ శాసన సభ్యుడు, "అమ్మాయిలు తమను తాము ఓవర్ కోట్‌తో కప్పుకోవాలని" పుదుచ్చేరి మంత్రి, "సిపిఎం పార్టీ కుటుంబాలపై, వారి మహిళలపై అత్యాచారాలు దాడులు చేస్తామని" తృణముల్ మంత్రి... ఇలా పురుషులమనే అహంకారంతో ఈ రకమైన కామెంట్లు చేస్తున్నారు.

ఇవాళ ఈ పురుషాధిపత్య భావజాలం అనేది కేవలం పురుషులకు మాత్రమే పరిమితం అనుకుంటే పొరపాటే ఎందుకంటే " దేశంలో జరుగుతున్న వరుస అత్యాచారాలకు కారణం స్త్రీలు, పురుషులు రాసుకు పూసుకు తిరగడమే" అంటూ గతంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించడాన్ని గమనించాలి. ఒక మహిళ ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు ఇలాంటి చౌకబారు కారణాలు చెప్పడం భావ్యమా?

డ్రస్సులు, బాల్యవివాహాలు, క్రమశిక్షణ లాంటివి మహిళలపై దాడులను అపుతాయా? అయితే మరి మూడేళ్ళ పాప ఎలాంటి డ్రస్ వేసుకుందని ఆమెపై అత్యాచారం చేస్తున్నారు. చిన్న పిల్లలు ఎవరితో రాసుకు పూసుకు తిరుగుతుందని అత్యాచారం జరుగుతోంది.

స్త్రీల శీలం, పరువు ప్రతిష్టలు అత్యాచారం వల్ల పోతాయని చెప్పడం కంటే మించిన పితృస్వామిక ఆధిపత్య భావజాల వ్యక్తీకరణ మరొకటి ఉంటుందా? అత్యాచారం అనేది జీవితానికి తగిలిన ఒక బలమైన గాయం మాత్రమే. అంతమాత్రాన జీవితం అయిపోయినట్లు కాదు.

చట్టాలు ఏం చేస్తున్నాయి

దేశానికి దిశా నిర్దేశం చేయాల్సిన ప్రజాప్రతినిధుల మాటలు ఈ విధంగా ఉంటే ఇక సమాజంలో ఎక్కడా న్యాయం జరగని ఆబల చివరకు న్యాయాన్ని వెతుక్కుంటూ వెళ్ళేది పోలీస్ స్టేషన్లకు, కోర్టుకే. మరి, అక్కడా పురుషాధిక్యత మహిళలను వెంటాడితే ఒక మహిళలకు ఎక్కడ సమాధానం దొరుకతుందనేది ప్రశ్నార్ధకంగా మారింది. మహిళలు వారి ఘోషను చెప్పుకోవడానికి పోలీస్ స్టేషనుకు వెళితే అక్కడా వారిపై అత్యాచారం, ఇదివరకు మన ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన వాకపల్లి ఘటన. నక్సల్స్ ఏరివేతలో భాగంగా స్పెషల్ టీం వాకపల్లి గిరిజన మహిళలపై అత్యాచారం చేశారు. ఆ కేసు ఇప్పటికీ నడుస్తూనే ఉంది. మణిపూర్‌లో సైనిక చర్యల పేరుతో మహిళలపై అత్యాచారం చేసి దారుణంగా చంపేస్తున్నారు. కాశ్మీర్‌లోని కునర్ డ్రాయంలో ఒకే రోజు 64మంది మహిళలు పోలీసుల చేతిలో అత్యాచారానికి గురయ్యారు. ఇలాంటి ఎన్నో ఘటనలను నిత్యం వింటూనే ఉన్నాం. కేసు నమోదు చేయాల్సిన పోలీసులే ఇలా వ్యవహరిస్తే ఇక న్యాయం జరిగేది ఎక్కడ.

ముంబాయిలో శక్తిమిల్ అత్యాచార బాధితురాలి తరపున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ కోర్టులో మాట్లాడుతూ "అత్యాచారం అనేది మహిళ శరీరంపై దాడి మాత్రమే కాదు. ఆమె మనసు, శీలం, ప్రతిష్ట, ఆత్మగౌరవాలపై దాడి కూడా. బాధితురాలు చనిపోతే తప్ప ఆ గాయాలు మానిపోవు" అని వ్యాఖ్యానించాడు. అత్యాచారానికి గురయిన స్త్రీ చనిపోవడం తప్ప మరో మార్గం లేదని చెప్పే వాదన ఎంత ఘోరం. స్త్రీల శీలం, పరువు ప్రతిష్టలు అత్యాచారం వల్ల పోతాయని చెప్పడం కంటే మించిన పితృస్వామిక ఆధిపత్య భావజాల వ్యక్తీకరణ మరొకటి ఉంటుందా? అత్యాచారం అనేది జీవితానికి తగిలిన ఒక బలమైన గాయం మాత్రమే. అంతమాత్రాన జీవితం అయిపోయినట్లు కాదు. పరువు ప్రతిష్టలు, శీలం పేరుతో ఆ గాయాన్ని పెద్దది చేసి బాధితురాలు కోలుకోకుండా చేసే ప్రతి ఒక్కటి ఆమె జీవితంపై పదేపదే జరిగే అత్యాచారాలు మాత్రమే. భూస్వామ్య, పితృస్వామ్య భావాలకు చెందిన ఈ మెదడ్లు మారితే తప్ప స్త్రీలపై ఘోరాలు తగ్గవు.

పరువు పేరుతో హత్యలు

ముజఫర్‌నగర్‌కు చెందిన ఖాఫ్ పంచాయితీ నవంబర్ 2014లో అమ్మాయిలపై కొన్ని భయంకర షరతులను విధించింది. అవి, అమ్మాయిలు మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్ వాడరాదని, జీన్స్ వేసుకోరాదని, సామాజిక వెబ్‌సైట్లయిన వాట్స్‌యాప్, ఫేస్‌బుక్ లాంటివి కూడా వాడకూడదని నిషేధించింది. పంచాయితీ పెద్దైన చౌదరి నరేష్ ఏమంటున్నారంటే – "జీన్స్ పాశ్చాత్య సంస్కృతి. ఇది మనదేశంలో వాడకూడదు. అసలు మనం ఎక్కడ నివసిస్తున్నామో కూడా అర్థం కావడం లేదు. దీనివల్ల అమ్మాయిలు పాడయిపోతున్నారు" అంటూ కఠినమైన నియమాలను అమలుచేస్తున్నారు. అంతేకాదు, 16ఏళ్ళ లోపై వివాహాలు చేయాలి. లేకపోతే అత్యాచారాలకు గురవుతారని కూడా వ్యాఖ్యానించాయి ఖాఫ్ పంచాయితీలు. 16ఏళ్ళ అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాలకు ఇలాంటివి చెప్పారు. మరి ఇక్కడ జరుగుతుంది 30ఏళ్ళు పైబడిన వివాహిత మహిళలపై. మరి వాటికి మీ సమాధానం అంటే ఇంట్లో నుంచి బయటికి రాకూడదు. ఒకవేళ వస్తే ముఖానికి పవిట కప్పుకొని రావాలి. ఇలాంటివి విన్నప్పుడల్లా నిజంగానే మనం ఎక్కడ నివసిస్తున్నామో ఆలోచించండి.

పితృస్వామిక భావజాలం

మహిళలపై పెరుగుతున్న నేరాలకు అనేక కారణాలున్నా ముఖ్యంగా చెప్పుకోదగ్గది మాత్రం పితృస్వామిక భావజాలం. అనాదిగా కొనసాగుతున్న పితృస్వామిక వ్యవస్థ మహిళలను శారీరకంగా, మానసికంగా బలహీనులుగా మార్చి లింగపరమైన అసమానతల సమాజంగా మార్చడం వల్లనే మహిళలపై వివిధ రకాల దాడులు జరుగుతున్నాయని సామాజిక వేత్తలు

మానసికంగా బలంగా ఉంటేనే మార్పు సాధ్యం

మహిళలపై హింసకు మార్కెట్ సంస్కృతి పెరగటమే కారణం. స్త్రీని మార్కెట్‌లో వస్తువుగా చూపించే సంస్కృతి పెరిగింది. పెట్టుబడిదారీ సమాజంలో బలహీనుల మీద బలవంతుల దోపిడి జరుగుతుంది. అదేవిధంగా ఇక్కడ కూడా బలహీనులుగా చూపిస్తున్న మహిళల మీద దాడులు పెరిగుతున్నాయి. మనమీద ఎవరయినా దాడి చేస్తున్నారనుకుంటే వెంటనే తిరగబడటం అలవాటు చేసుకోవాలి. తిరగబడినప్పుడు ఇంకా బలం ప్రయోగిస్తాడు. అయినా కాని మనం మానసిక సైర్ధ్యాన్ని విడవకుండా ఎదురుతిరిగినప్పుడే మనల్ని మనం కాపాడుకోగలం. "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అన్న మార్క్స్ పిలుపుపై ప్రపంచంలో జరిగిన ప్రతి విప్లవానికి నాంది. ఇది ఒక్క కార్మికులే కాదు. సమాజంలో కార్మికులుగా చూడబడుతున్న స్త్రీలకు కూడా వర్తిస్తుంది. ఆ నినాదంతోనే ప్రపంచవ్యాప్తంగా మహిళల తిరుగుబాటు జరిగింది. నేడు దాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. మనం తిరగబడితే ముందు వ్యతిరేకత వస్తుంది. ఆ వ్యతిరేకత నుంచే అనుకూలత కూడా వస్తుంది. చదువు కోవాలి. ఉద్యోగం చేయాలి. వీటిల్లో ముడుచుకుపోయే స్వభావాన్ని వదిలేయాలి. అప్పుడే మార్పు వస్తుంది.

– లక్ష్మి, కేశవ మెమోరియల్ కాలేజి ప్రిన్సిపాల్, సామాజికవేత్త

అభిప్రాయపడుతున్నారు. మహిళలను సంభోగ వస్తువుగా, పిల్లల్ని కనే యంత్రంగా, వంటింటి కుందేలుగా, వరకట్నం తెచ్చే వారిగా మాత్రమే చూస్తూ వారిపై అజమాయిషీ చలాయించే పితృస్వామిక భావజాలం సమాజంలో బాగా పాతుకుపోయింది. భారతీయ సమాజంలో ఆడది అంటే చులకన భావం ఉంది. దీన్ని ఉగ్గుపాలతో కలిపి తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచుతున్నారు. భార్య, తల్లి, చెల్లి, కూతురు, పక్కింటి అమ్మాయి... అందరూ ఆడవాళ్లే. నేనేం చేసినా చెల్లుతుందనే ధోరణి వారిని దాడులకు పురుగొల్పుతోంది. స్త్రీ అస్తిత్వాన్ని గుర్తించని పితృస్వామిక అధిపత్య ధోరణి మహిళలపై లైంగిక, భౌతిక దాడులకు కారణమవుతోంది.

వ్యాపార సంస్కతి

మహిళలపై అత్యాచారాలు ఆగాలంటే "దుస్తుల విషయంలో సాంప్రదాయత కనిపించాలని" పార్లమెంట్‌లో ఎం.పి మురళీమోహన్ వ్యాఖ్యానించారు. మరి ఈయన "మా" అధ్యక్షుడు కద. సినిమాల్లో మహిళల వస్త్రధారణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎందుకు చెప్పడం లేదు. బయటికి చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని వీటిని బట్టే అర్థం చేసుకోవచ్చు.

మహిళలను అన్నిరకాల వ్యవస్థల్లోనూ ఆట వస్తువుగానే చూస్తున్నారు. పెట్టుబడిదారీ సమాజంలో ప్రతిదీ వస్తువే. అలాగే బలహీనులపై బలవంతులు దోపిడి చేస్తూ మార్కెట్‌ను పెంచుకుంటారు. ఇక్కడ కూడా సమాజంలో తక్కువ జాతిగా చూడపడుతున్న స్త్రీలను బలహీనులుగా మార్చి దాడులకు, హింసకు గురిచేస్తున్నారు. వీటిల్లో సినిమాలు, మీడియా, అడ్వటేజ్‌మెంట్లు, సీరియళ్లు, దృశ్య, శ్రవణ మార్గాలు. అందాల పోటీల పేరుతో స్త్రీని ఆట వస్తువుగా మార్చి మార్కెట్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. వీటిలో స్త్రీ అంగాంగ ప్రదర్శనకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఐటంసాంగ్ లేని సినిమాలు రాకపోవడం దురదృష్టకరం. హీరో, హీరోయిన్లు ప్రేమిస్తున్నట్లు, దానికి ఎంతకైనా తెగించి ప్రేమను సాధించుకున్న సన్నివేశాలను ఎంతో ఆసక్తికరంగా సినిమాల్లో చూపిస్తున్నారు. దీన్నే నిత్యజీవితంలో యువత పాటిస్తున్నారు. రాక్షస ప్రేమతో అమ్మాయిల మనసులు గాయపరుస్తున్నారు. అదీకాక, సినిమాల్లో హీరోయిన్ అందాల ఆరబోతగానే ఉంటుంది కాని తనకు వ్యక్తిత్వం ఉన్న క్యారెక్టర్‌ను మాత్రం ఇవ్వడం లేదు. ఇలా చలన చిత్రాలలో స్త్రీని వ్యక్తిత్వం ఉన్న మనిషిగా కాకుండా శృంగార వస్తువుగా చిత్రీకరిస్తున్నారు. సినిమాల్లో ఇలాంటి సన్నివేశాలను కట్టడిచేయకపోవడం వల్లనే ఇలాంటి విపరీత పరిణామాలు సంభవిస్తున్నాయని మహిళా సంఘాలు అంటున్నాయి. అటు సీరియళ్ళలోనూ మహిళలపై దౌర్జన్యాలను చూపిస్తున్నారు. దీని వల్ల యువత పెడదోవపడుతుంది.

సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి సమాజానికి ఎంత మేలు జరుగుతుందో అంతే దుర్వినియోగం అవుతోంది. టెక్నాలజీని దుర్వినియోగం చేయడం వల్ల జరుగుతున్న దుష్పరిణామాల్లో మహిళలపై లైంగికదాడులు కూడా ఒకటి. నియంత్రణ లేని అశ్లీల సాహిత్యం, సినిమాలు, అసభ్యకర దృశ్యాలు నేడు మొబైల్ ఫోన్లలో, కంప్యూటర్లలో ఇంటర్‌నెట్ ద్వారా దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ చాలా సులభంగా లభించడం వల్ల యువత మనసులను కలుషితం చేయడమే కాక మహిళలపై అత్యాచారాలకు, దాడులకు పాల్పడేలా చేస్తున్నాయి. ఈవిషయం అనేక కేసుల్లో రుజువైంది కూడా.

నైతిక విలువల పతనం

మార్కెట్ సంస్కృతి పెరిగిన తర్వాత నైతిక విలువలు పతనం అయ్యాయి. మానవత్వం మచ్చుకు కూడా కనిపించడం లేదు. ఇవి కూడా మహిళలపై అత్యాచారాలు హత్యలు, లైంగిక దాడులు పెరగడానికి కారణాలు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనమవడంతో పిల్లల్లో తగిన పరిపక్వత, సంపూర్ణ వ్యక్తిత్వం పెంపొందడం లేదు. వ్యక్తిగత క్రమశిక్షణ, స్వీయ నియంత్రణపై యువతకు తగిన మార్గనిర్దేశం చేసేవారే కరువయ్యారు. తల్లిదండ్రులు ఉద్యోగస్తులు కావడంతో వారిని పట్టించుకునేవారే కరువయ్యారు. దాంతో ఇంటా బయటా క్రమశిక్షణ జవాబుదారీతనం లోపించి కూడా నేర తీవ్రతకు దారితీస్తుంది. అనేక ఘటనల్లో అత్యాచారానికి పాల్పడిన నిందితులు బాధితులకి తెలిసిన వారై ఉంటున్నారు. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో కూడా తెలియని పరిస్థితి. విద్యావంతులు సైతం వికృత చేష్టలకు పాల్పడుతున్నారు.

అత్యాచారాలు మహిళల సమస్యకాదు. సమాజంలో మానసిక రుగ్మతకు చిహ్నం. వీటిని జాతి సమస్యగా గుర్తించాలి. మహిళలపై నేరాలకు మూలాలేంటి? లోపం ఎక్కడుంది? వ్యవస్థలోనా? వ్యక్తుల్లోనా? అని ఆలోచించినప్పుడే మార్పు సాకారమవుతుంది. సమాజంలో మార్పు కేవలం చట్టాల సవరణ, కొత్త చట్టాల రూపకల్పన ద్వారానే వస్తుందనే భావన సమంజసం కాదు. ఎన్ని చట్టాలు వచ్చినా సమాజంలో మార్పు వస్తేనే మహిళలపై దాడులు ఆగుతాయి. దానికి పటిష్ట చట్టాలు, వాటి అమలు, సత్వర న్యాయం జరిగినప్పుడే మహిళలపై హింస సామాజిక దృక్పథంలో మార్పు వస్తుంది.

– ఆశాభారతి, 9441829090

■ క్లాసిక్ స్టోరీ: అనామకుడు

శీలమా? అదియేమి?

విశాలాక్షి స్త్రీ.

మనుషులందు స్త్రీ పురుష భేదమున్నది.

ఈ స్త్రీ పురుష భేదము దైవదత్తము. దైవదత్తమని రాసినాడు, వీడు దేవుని నమ్మునను కున్న అది సత్యము కాదు. నాకు దేవుని యందు నమ్మకము లేదు. అసలీ పురాణములు నాకు ప్రమాణములు కావు. మరి పై వాక్యములోని దేవుదెక్కడ నుండి వచ్చెను?

అది భాషలోని చమత్కారము. మనిషి మనసునందొక భావముదయించును. అది వేరొక మనిషికి చెప్పవలెను. అటుల చెప్పుటకుపయోగించు సంజ్ఞ భాష. ఈ భాషకి స్పష్టత ముఖ్యము. అది విన్నవారికో, చదివినవారికో అర్థము కావలెను. అందరికీ అర్థమగునటుల మాటలాడవలెనన్న లోక విరుద్ధమగు పద ప్రయోగము చేయరాదు. ఒక కథను రాసెడువాడు జనసామాన్యములో వాడుకలోనున్న మాటలనే వాడవలెను.

మనదొక జాతి. కొన్నివేల సంవత్సరములుగ కొన్ని ఆలోచనలు, ఆచారములు మనకంటినవి. మనలో నాటుకున్నవి. అటుల నాటుకున్న ఒక భావమే దైవము. అది యటుండనిమ్ము.

మనుషులందు స్త్రీ పురుష భేదమున్నది.

విశాలాక్షి స్త్రీ.

ఆమెకొక అన్న కలడు. ఆమె కన్న ఇరువది సంవత్సరములు పెద్ద. కొన్ని సంసారములింతియే. నడుమ చాల సంవత్సరములు పిల్లలు పుట్టరు. పుట్టిపోదురు. విశాలాక్షి తండ్రి ఆమె జననమునకు ముందే చనిపోయెను. తల్లి జన్మనిచ్చి మరణించెను. విశాలాక్షిని పెంచి ఇరువది రెండు సంవత్సరములు యువతిని చేసినది జానకి.

జానకి విశాలాక్షికి వదినె. రామచంద్రునకు భార్య. ఆ దంపతులకొక కొడుకు కలడు. పేరు రంగనాథము. విశాలాక్షికన్న రెండు సంవత్సరములు చిన్న.

మగవారెవ్వరైనా వచ్చిన లోనింటి నుండి వెలుపలికి ఆడువారు రాకూడదను నిమమము వారింట లేదు.

మన సమాజములో మార్పు మూడు రకములు. కొన్ని సంవత్సరములుగా వచ్చుచున్న ఆచార వ్యవహారములను పట్టుకొని యుండెడివారు కొందరు. అట్టి ఆచారములలో అర్థము లేదని కొత్త మార్గములలో పోయెడివారు కొందరు. మరికొందరుందురు. వారు పూర్తిగా కొత్త మార్గమునపోరు. కాని అటులపోవుట తప్పుగా భావించరు.

రామచంద్రుని కుటుంబము మూడవ జాతికి చెందినది. వారు పూర్తిగా మారలేదు. కాని మారుట తప్పుగా భావించరు. నేడు మనలో నిట్టివారి సంఖ్యయే అధికము.

రంగనాథము స్నేహితులతో విశాలాక్షి చనువుగా నుండును. వారందరిలోను ఆమెకు విశ్వనాథముతోటి చనువెక్కువ.

విశ్వనాథము రంగనాథము కన్న ఆరేళ్ళు పెద్ద. అతడు రంగనాథము చదువుతున్న కళాశాలలో అంగ్లోపన్యాసకుడు. వారిరువురి నడుమ గురు శిష్య సంబంధము కన్న స్నేహ సంబంధమెక్కువ. స్నేహితుని ఇంటికి తరచు వచ్చెడువాడు విశ్వనాథము.

కొన్ని కొన్నాళ్ళకు ఆ వచ్చుట రంగరాథము కొరకు కాక, విశాలాక్షి కొరకే

ననిపించుట మొదలిడెను.

మొదట కొన్నాళ్ళు రంగనాథమింట లేడన్న వెంటనే వెడలిపోయెడివాడు. తరువాత కొన్నాళ్ళు రంగనాథమింట లేడన్న విశాలాక్షి యున్నదా యని యడిగెడువాడు. మరికొన్నాళ్ళకు విశాలాక్షి యున్నదాయన్న ప్రశ్నతోనే వచ్చుచుండెను.

ఉపన్యాసకుడగుట చేతనేమో విశ్వనాథము గంటల తరబడి మాటాడగలడు. ఆ మాటలాడుట నందొక నేర్పున్నది. వినువారికి విన్నంతసేపు కాలగమనము తెలియదు. ఒక గంట గడచును. ఇంతలో ఒక గంట గడిచెనా అని అనిపించును. గంట అనినెంత? అరువది నిముషములు.

అరువది నిముషములుపైన మనలని మనము మరచునటుల మాటాడుట యన్నమాటలా? అటుల మాటాడుల ఒక కళ, ఈ కళయందు విశ్వనాథము నిష్ణాతుడు.

ఏ కళయైనను కానిమ్ము, కళాకారుడెంత గొప్పవాడైనను కానిమ్ము. ఆ కళను అనుభవించెడువాడు రసజ్ఞుడయిన కాని కళ రాణింపదు. విశ్వనాథము మాటాడుదానిని విశాలాక్షి అర్థము చేసుకొనగలదు. ఆనందించగలదు.

వారెన్నో విషయముల గురించి ప్రసంగింతురు – చూచిన చలన చిత్రముల గురించి, చదివిన పుస్తకముల గురించి, వివిధ భాషలలోని మంచి గ్రంథములను గురించి విశ్వనాథము వివరించును. విశాలాక్షి వినును. విశాలాక్షి చెప్పును. విశ్వనాథము వినును.

అటుల మాటలాడుటలో వివాహము గురించి ప్రసంగము వచ్చును. విశ్వనాథము విశాలాక్షిని తనను పెళ్ళాడుదువా అని అడుగును. ఆమె సమాధానమీయదు.

అటుల సమాధానమీయకుండుటలో విశాలాక్షికి అభ్యంతరము లేదని విశ్వనాథము నిశ్చయించుకొనెను. కొన్నాళ్ళ తరువాత తనకామె అర్ధాంగి కాగలదని అతడనుకొన మొదలిడెను.

విశాలాక్షి విశ్వనాథము యెడ చూపెడు చనువును వదినె చూచెను. చూడకుండుటకామె గుడ్డిదా? విశాలాక్షి నలుగురకు తెలియునటులగనే ప్రవర్తించును. వారిరువురు గంటల తరబడి మాట్లాడుదురు.

విశ్వనాథము గుణవంతుడు. మంచి యుద్యోగము నందున్నాడు. చూచుటకు పెద్ద అందగాడు కాకున్నను కురూపి కాడు. మగవాని అందమునకేమున్నది? అన్నా వదినెలిద్దరు, వారిద్దరి వివాహ వార్తకై ఎదురుచూచుకుండిరి.

ఆ సమయమున ఒక ఘోరము జరిగెను.

విశాలాక్షి చనిపోవ ప్రయత్నించెను.

ఒకనాడు ఆమె వర్షములో తడిసివచ్చెను. వచ్చి ఏమియు మాటలాడక, భోజనము చేయక కూర్చుండెను. రాత్రి ఎందుకో మెలుకువ వచ్చిన జానకికి చీరను తాడుగా కంఠమునకు తగిలించుకొనుచున్న విశాలాక్షి కనిపించెను. ఆమె నా ప్రయత్నము నుంచి విరమింపచేసి జరిగినది తెలుసుకొనెను.

వర్షమున నిలుచుండిన విశాలాక్షి ఇంటికి చేరుటకై వేరొక వ్యక్తి కారునెక్కెను. ఆ వ్యక్తి వర్షములో కారునొక చోటికి తీసుకపోయి, బలాత్కరించి ఆమెను చెరచెను. ఆమెనింటి దగ్గర దింపి, పోలీసులకీ విషయము చెప్పిన నీకే నష్టమని చెప్పిపోయెను.

అన్నా వదినెలు కూడా ఈ విషయమందరికి తెలిసిన విశాలాక్షి వివాహమగుట కష్టమగునని భయపడిరి.

విచారముతో విశాలాక్షి తన గదిలోను, ఒకరితో నొకరు మాట్లాడుకొనకుండ తక్కిన ముగ్గురు హాలులోన కూర్చుండగ విశ్వనాథము వచ్చెను. ఇంటనందరూ అంత విచారముగా నుండుటకు కారణమడిగెను. వారేదియో చెప్పి అతనిని పంపించ ప్రయత్నించిరి. కాని అతడు తరచి తరచి అడిగి అసలు విషయము గ్రహించెను. వెంటనే విశాలాక్షి గదిలోనకు పోయెను.

"విశాలాక్షీ!" విశ్వనాథము పిలిచెను.

"ఆ పేరుతో నన్ను పిలిచి ఆ పేరున పవిత్రము చేయకుండుడు. అది హిందువులకందరకు తల్లియగు కాశీ విశాలాక్షి పేరు – నాకెట్ల వచ్చినదో?" విశాలాక్షి కంట నీటితో, కంఠమున బాధతో అనెను.

"నీవు చాల బాధపడుచున్నట్లున్నావు. అంత బాధపడవలసినదేమియు జరగలేదు".

"ఒక స్త్రీకి శీలమెంతో ముఖ్యము. నేను దానిని కోల్పోయితిని".

"ఏమి కోల్పోయితివి?"

"శీలమును"

"శీలమా? అది యేమి?"

విశాలాక్షి అతనిని నివ్వెరపడి చూచినది.

"నీ ధనము పోయినదా? నగలు పోయినవా?"

"వాటికన్న ముఖ్యమయినది పోయినది"

"అని నీవు భ్రమపడుచుంటివి. అసలు పోయినదేమియు లేదు"

"మీరు నన్నోదార్చుటకిట్లు మాట్లాడుచుండిరి. మీకు తెలియదా నాకు మానమెంత ప్రాణమో"

"విశాలాక్షి – నిన్నాపేరుతోనే పిలిచెదను. నీతో ఈ విషయము మున్నెన్నడు ప్రసంగించలేదు. దానికి అవకాశము రాలేదు. ఈ సమయము ప్రసంగములకు అనువైనది కాదు. కాని అవసరమట్లు చేయుచున్నది"

"కూర్చుండుడు"

విశ్వనాథము విశాలాక్షి పక్కన కూర్చుండెను. కూర్చుని ఇట్లనెను.

"స్త్రీ పురుషుల నడుమ శృంగార భావము తప్పక యుండును. అది జంతువులన్నింటియందు ఉన్నది. అసలీ శృంగార భావము లేకున్న సృష్టి జరగదు. ఇది ఈ సృష్టికి అవసరమయిన ప్రక్రియ. దానిని మనము కాదనరాదు.

పచ్చి శృంగార భావముకాక తక్కిన భావములు మనిషికి అవసరమయ్యెను. మనిషి ఆహారము కొరకు వేటమాని, ఆహారోత్పత్తి చేయుట మొదలిడిన తర్వాత ఆస్తి వ్యవహారములు వచ్చినవి.

సమిష్టి ఆస్తి కాక వ్యక్తుల ఆస్తి వచ్చెను. మాతృస్వామ్య వ్యవస్థతో మొదలయి నెమ్మదిగా పితృస్వామ్య వ్యవస్థ వచ్చెను.

తండ్రినుండి కొడుకునకు ఆస్తి రాసాగెను. తన ఆస్తి "తన" కొడుకునకే చెందవలయునన్న తండ్రి కోరిక కారణమున భార్యకి ఎన్నో కట్టుబాట్లు వచ్చెను. ఆ కుటుంబ వ్యవస్థ పటిష్ఠ పరచుటకే స్త్రీకి శీలమను ఆభరణము తొడగబడెను.

ఈ వ్యవస్థ మంచిది. ఉపయోగకరమైనది. శీలమనునది ఈ వ్యవస్థకొరకే కాని, స్త్రీ కొరకు కాదు. వ్యవస్థ కొరకే దానికొక పవిత్రమైన దానిని చేసి, అది పోగొట్టుకున్నదని ఒక స్త్రీని అధోగతిపాలు చేయుచున్నారు. ఇందేమి నీతి యున్నది?"

"ఏ స్త్రీ ఏ పురుషునితోనైన కలసి ఉండవచ్చునందురా?" విశాలాక్షి కంఠమున కంపరము ధ్వనించెను.

విశ్వనాథము నవ్వెను. "నేనటుల అనను. అది తప్పని నా భావము కాదు. కాని అది మన ప్రస్తుత సమాజ పరిస్థితులకు సరికాదు. అవసరములను బట్టి ఆచారములు మారును. మన ప్రస్తుత సమాజమునందీ వ్యవస్థ ఉన్నది. ఇందు స్త్రీ పురుష స్వేచ్ఛా శృంగారము నిషిద్ధము. దానిని నేనంగీకరింతును. నేను చెప్పునది వేరు. ఒక స్త్రీని వేరొక పురుషుడు బలాత్కారముగా అనుభవించినంత మాత్రమున ఆ స్త్రీ పోగొట్టుకున్నదేమియు లేదనియే"

"మీరు చెప్పునది నా కర్థము కాలేదు"

"ఒక స్త్రీ ఒక పురుషుని ప్రేమించినదనుకొనుము. ఆమెను ఆమె తండ్రి ఏదో కారణమున వేరొక పురుషునకిచ్చి పెండ్లి చేసెననుకొనుము. వారిరువురి సంసారము సాగుచున్నది. ఆమెకా సంసారము చేయుట కొంచెమైనను ఇష్టము లేదు. ఆమె పోగొట్టుకున్నదేమి?"

"సుఖము, సంతోషము, ఆనందము"

"శీలము పోయినదా?"

"శీలమెట్లు పోవును? ఆమె తన మగనితో కదా కాపురము చేయుచున్నది"

"వాడెట్లు మగడైనాడు? బలాత్కారమననేమి? నీకిష్టము లేకుండా నిన్నొకడనుభవించుటయే కదా? మరి తనకిష్టములేని మగనితో సంసారమేమి? తనకిష్టమయిన మగడే కానిమ్ము. తన కిష్టము కాని సమయమున మగని అవసరమునకై తననర్పించుకొనుటయేమో"

విశాలాక్షి మాటాలడలేదు.

"ఇంకొక విషయమునర్థము చేసుకొనకుండ నమ్ముచుండి.

విశ్వనాథము నవ్వెను. "నేనటుల అనను. అది తప్పని నా భావము కాదు. కాని అది మన ప్రస్తుత సమాజ పరిస్థితులకు సరికాదు. అవసరములను బట్టి ఆచారములు మారును. మన ప్రస్తుత సమాజమునందీ వ్యవస్థ ఉన్నది. ఇందు స్త్రీ పురుష స్వేచ్ఛా శృంగారము నిషిద్ధము. దానిని నేనంగీకరింతును. నేను చెప్పునది వేరు. ఒక స్త్రీని వేరొక పురుషుడు బలాత్కారముగా అనుభవించినంత మాత్రమున ఆ స్త్రీ పోగొట్టుకున్నదేమియు లేదనియే"

బలాత్కారము చెడు కాదని నేనన‌ను. కాని దాని వలన మీరేదియో పోయినదని బాధపడుటకర్థము లేదు. దానిని దాచి యుంచుట కూడా మంచి పని కాదు"

"నలుగురికి తెలిసిన నవ్వులపాలగుదుము కదా?"

"మీయన్న నెవ్వరైనా దారిలో కొట్టిన పోలీసులకు తెలుపక మీరూరుకుందురా? మీ యింట దొంగలు పడి దోచుకున్న మీ ప్రవర్తన ఇట్లుండునా? వాడెవ్వడో నిన్ను బలాత్కరించెను. నలుగురికి తెలిసిన నవ్వెదరా? ఎవరిని చూసి? నిన్ను చూసా? అటుల నవ్విన వారితో నీకు పనియేమి? వారు నిన్ను చూసి నవ్వుట కాదు, వారిని చూసి అసహ్యించుకొనవలెను."

"సంఘము మీరనుకొనినంత మారలేదు - ప్రగతి సాధించలేదు"

"సంఘమేది ప్రగతి సాధించుటకు, సాధించునది మనము. మనమిటుల కూర్చున్నంత కాలమిది ఇటుల సాగుచునే యుండును. కాళ్లకి ఎత్తుమడమల చెప్పులు, పెదవులకు ఎర్రని రంగులు ప్రగతి కాదు. ప్రగతి ఆలోచనలో రావలెను, ఆచరణలో రావలెను. నువ్వు భయపడి వానిని బయటపెట్టుకున్న వాడు మరి కొందరినిటులనే చేయును. వానిని చూచిన మరికొందరికి విచ్చలవిడితనము వచ్చును, అది నీకిష్టము కాబోలు"

"కాదు" విశాలాక్షి అనెను.

"అటులయిన వానిని వదిలేసి నీ జీవితమున ఒక చెడ్డపని చేయకుము"

"నా జీవితమునకు కూడా అర్థమున్నదా?"

"నీ జీవితమునకేమయినది. నిన్నకీ, నేటికీ ఏమియు జరగలేదే. నీవు బస్సు నుండి పడిన నీకు గాయమగును. నీ బ్రతుకున కర్థము పోవునా? వాని వివరములనిమ్ము. నేను పోలీసులకు చెప్పెదను"

"ఈ విషయము నలుగురకు తెలిసిన ఎవ్వరును నన్ను వివాహమాడరని వదినె భయము"

"నిన్నెవడు వివాహమాడవలెను?"

"నన్నెవరు ఆడుదురు?"

"నేనెన్నియోసార్లు నిన్నడిగితిని - నన్ను వివాహమాడెదవా అని. మరల అదే ప్రశ్న అడుగుచున్నాను. నీవు ఆడెదననువరకు నేనడుగుచుందును" విశ్వనాథము లేవబోయెను.

విశాలాక్షి అతని చేతులను తన చేతులలోనికి తీసుకుని కళ్లకద్దుకొనెను.

(కథలూ, నవలలూ రాయడానికి ఒక చక్కని వాడుక భాష వంటి గ్రాంథిక భాషను తీర్చిదిద్దుకున్నారు విశ్వనాథ. ఈ కథ కోసం ఆ శైలిని వాడుకుందుకు ప్రయత్నించాను - రచయిత)

*

■ ఆ పాత మధురాలు

శ్రీశ్రీ సాంగ్ - లాంగ్ మార్చ్ విశ్లేషణ

శ్రీశ్రీ పదాలతో ఆడుకున్నాడు... పాడుకున్నాడు, పదాల పల్లకీలో ఊరేగాడు. ఊళ్ళకు ఊళ్లు ఉడికించాడు. పాటలు రాయడం మాటలు కాదు. సినిమా పాట మరీను. షరతుల మధ్య, హద్దులు, సరిహద్దుల నడుమ పాట పల్లవించి పరిమళించాలి. 'సినిమాకు పాట రాయడం చాలామంది అజ్ఞానులు అనుకునేంత సులభం కాదు' అంటూ మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో సెలవిచ్చాడు. అయితే సహజంగానే శ్రీశ్రీకి పాట రాయడం నల్లేరుపై నడకలా సాగింది. దానికి కారణం ఆయన 'పదాల బాద్‌షా' కావడం ఒక ఎత్తైతే సంగీతజ్ఞుడు కావడం మరో విశేషం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన పదాలతో... పదనిసలు ఆడుకున్నాడు. శ్రీశ్రీ పాటలు చందాల కేశవదాసుతో ప్రారంభమైన సినిమా పాట కావ్య గౌరవాన్ని సైతం అందుకునే దిశగా పురోగమించింది.

'విప్లవశంఖం' సినిమా కోసం "చెరసాలల శిరసులపై/ ఉరికొయ్యల చివరలపై / ఎగురుతుంది తిరుగు బావుటా!/ సాయంకాలపు ఉరికంబం/ తెల్లవారితే రవి బింబం!" అనే పాటలో ఉన్న విప్లవ స్థాయి గగనాన్ని తాకింది. ఉరితీయబడ్డ విప్లవ వీరుడు మలిసంజలో నలిగిపోవచ్చునేమో గాని ఆ యోధుని రక్తం మాత్రం రవి బింబమై తొలి సంజలో మళ్లీ శివమెత్తి విజృంభిస్తుందనే దాన్ని శ్రీశ్రీ ఇక్కడ ఎలుగెత్తి చాటాడు. అంతేకాదు! మరొక అభ్యుదయాత్మకమైన వాక్యాన్ని ఇదే చోట శ్రీశ్రీ బలంగా ప్రయోగించాడు. 'బతుకు సంతలో ముళ్ళపుంతలో/ ఎండుడొక్కలే ఎర్ర మల్లెలై' తిరగబడతాయంటూ హెచ్చరికలు ప్రయోగిస్తాడు. ఏమైనా సామ్యవాదంలోనే అభ్యుదయానికి మూలాలున్నాయని విశ్వసించిన వ్యక్తి శ్రీశ్రీ.

ఈ సినిమాలో ఈ తరం హీరో గోపీచంద్ తండ్రి టి.కృష్ణ షేక్ జాకబ్ శాస్త్రి అనే నిరుద్యోగి పాత్ర ధరించి తళుక్కున మెరిశాడు.

నవతరం పిక్చర్స్ బ్యానర్‌పై 'యువతరం కదిలింది' చిత్రంలో వెండి తెరపై ఎర్రజెండా ఎగరేసి ఎరుపు చిత్రాల నిర్మాతగా వరుస చిత్రాలను నిర్మించిన మాదాల రంగారావు మూడో చిత్రం 'విప్లవ శంఖం' చిత్రానికి సెన్సార్ వారు సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరిస్తే.. మద్రాసులోని శాస్త్రి భవన్‌లో ఉన్న సెన్సార్ ఆఫీసు ముందు నిరాహారదీక్ష చేసిన తొలి నిర్మాత మాదాల. తమిళ అగ్ర నటులు ఎం.జి.ఆర్, శివాజీ గణేశన్ అక్కడికి వచ్చి ఆయనను అభినందించారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎన్.ఎఫ్.డి.సి చైర్మన్ ద్వారా నిరాహార దీక్ష విరమించుకొమ్మని పరోక్షంగా ప్రయత్నించినా ఆయన పట్టు వీడలేదు. దాంతో ఆ చిత్రం సెన్సారు కాక తప్పలేదు. శ్రీశ్రీ టైటిల్ సాంగ్ రాసిన మాదాల నిర్మించిన 'ప్రజాశక్తి' చిత్రాన్ని కూడా సెన్సారు వారు నిరాకరిస్తే ఆయన సుప్రీం కోర్టు వరకు వెళ్లారు. ఏడాదిన్నర పాటు సాగిన ఈ పోరాటంలో దేశంలోని అత్యున్నత న్యాయస్థానం తీర్పు మేరకు చిన్న మార్పులు చేసి సెన్సారు సర్టిఫికెట్ ఇవ్వక తప్పలేదు. మరో చిత్రం 'జనం మనం' ట్యాన్ చేయబడి ఎనిమిది నెలల అనంతరం కమ్యూనిస్టు నాయకుల నిరాహార దీక్షతో సర్టిఫికెట్ ఇవ్వక తప్పలేదు. వీరిదే ఎర్రమట్టి చిత్రానికి ఐదేళ్ళ అనంతరం సెన్సారు సర్టిఫికెట్ లభించింది. చలన చిత్ర పరిశ్రమ చరిత్రలో ఇన్ని సార్లు సెన్సారు వారితో పోరాడి గెలిచిన నిర్మాత నటుడు మాదాల రంగారావు, శ్రీశ్రీకి , ఎర్రజెండాకి వీరాభిమాని.

- భూపతి వెంకటేశ్వర్లు, 9490098343

యువతరం పిక్చర్స్ వారి
విప్లవ శంఖం (1982)
నిర్మాత : టి.కృష్ణ, కె.రాధాకృష్ణ
దర్శకుడు : మీరం మస్తాన్‌రావు
సంగీతం : చక్రవర్తి
పాడినవారు : ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

పాట :
చెరసాల శిరసులపై
ఉరికొయ్యల చివరలపై
ఎగురుతుంది తిరుగుబాటు బావుటా!
సాయంకాలపు ఉరికంబం
తెల్లవారితే రవిబింబం!
మూయించిన ఒక వీరుని కంఠం
వేయి గొంతుకల విప్లవశంఖం!
పతిత దళిత జనరణ హుంకారం
ప్రళయ సమయ దిగ్గజ ఘీంకారం
బ్రతుకు సంతలో ముళ్ళపుంతలో
ఎండు డొక్కలే ఎర్ర మల్లెలై
కర్మ జన్మల గందరగోళపు
కుళ్లిన ఈ కుష్టు వ్యవస్థలో
అల్లాడే నేటి దీనులే
రేపటి విముక్తి వీరులై
విధిరాతలపై సవాలు చేస్తూ
విప్లవశంఖం వినిపిస్తారోయ్
కష్టం చాలక కడుపు మంటచే
తెగించి సమ్మెటు చేసేవాళ్ళూ
నిరపరాధులై నిరాధారులై
చెరసాలల్లో చిక్కేవాళ్లూ
చదివిన చదువులన్ని గుదిబండలుగా
నిరుద్యోగులై కుమిలేవాళ్ళూ
అనేకులింకా అభాగ్యులంతా
అనాథలంతా అశాంతులంతా
అక్రమాలపై సవాలు చేస్తూ
విప్లవశంఖం వినిపిస్తారోయ్

నెమలీక

నిజాయితీ

అదో చిన్న గ్రామం. అక్కడ విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఆ గ్రామానికి సర్వే చేయడానికి ఒక ఇంజనీరు వచ్చి, తన పని పూర్తి చేసుకుని రాత్రికి ఆ ఊరి గ్రామపెద్ద ఇంటికి వెళ్లాడు. రాత్రి భోజనం తర్వాత ఆ ఇంజనీరు తన బ్యాగ్ నుండి రెండు కొవ్వొత్తులు తీసి వెలిగించి ఏవో లెక్కలు రాసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత ఆ కొవ్వొత్తులను ఆర్పి, మరో రెండు కొవ్వొత్తులు బ్యాగు నుండి తీసి వెలిగించి ఒక పుస్తకం తీసుకుని చదవడం మొదలు పెట్టాడు.

ఇదంతా గమనించిన గ్రామ పెద్దకి సందేహం వచ్చింది. వెంటనే ఆయనతో "మీరు ముందు వెలిగించిన కొవ్వొత్తుల వెలుగులోనే ఈ పుస్తకాన్ని కూడా చదువుకోవచ్చుగా. వాటిని ఆర్పి వేరే వాటినెందుకు వెలిగించారు?" అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

అందుకు ఆ ఇంజనీరు మొదట వెలిగించిన కొవ్వొత్తులు ప్రభుత్వం ఇచ్చినవి. వాటి వెలుగులో ప్రభుత్వ పని చేశాను. ఇప్పుడు నా ఆనందం కోసం ఈ పుస్తకం చదువుతున్నాను కాబట్టి నేను కొన్న కొవ్వుతులు వెలిగించాను" అన్నాడు. ఆ గ్రామ పెద్ద ఆశ్చర్యంతో ఆ ఇంజనీరుని అలాగే చూస్తుండిపోయాడు. ప్రభుత్వ సొమ్ము కాజేయాలని చూసేవారే ఎక్కువగా ఉంటారు. కానీ ఇతను చాలా నిజాయితీగా ఉన్నాడు అని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు ఆయన. ఇంతకీ ఆ ఇంజనీరు ఎవరో తెలుసా? మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

ఎక్కడున్నాయ్

ఇక్కడ కనిపిస్తున్న వస్తువులు బొమ్మలో దాగున్నాయి. వాటిని వెతికి పట్టుకోండి.



నేను కూడా

అంకుల్ : బాబూ మీ నాన్న ఇంట్లో ఉన్నాడా?

బాబు : లేదు అంకుల్. నాన్న బజారుకెళ్లాడు.

అంకుల్ : సరే, మీ అమ్మను పిలువు.

బాబు : అమ్మ కూడా లేదంకుల్. కిట్టీ పార్టీకి వెళ్లింది.

అంకుల్ : పోనీ మీ అక్కో, అన్నో ఉంటారుగా. ఎవరో ఒకరిని పిలువు.

బాబు : మా అన్నయ్య ఆడుకోడానికి వెళ్లాడు.

అంకుల్ : (ఎవర్నడిగినా లేరంటున్నాడన్న కోపంతో) మరి అందరూ బయటికి వెళ్తే నువ్వెందుకు ఇంట్లోనే ఉన్నావ్?

బాబు : నేను ఉన్నది కూడా మా ఫ్రెండ్ ఇంట్లోనే అంకుల్. ఇది మా ఇల్లు కాదు.

ప్రశ్న-జవాబు

టీచర్ : నెపోలియన్ ఏ యుద్ధంలో చనిపోయాడు?

విద్యార్థి : తన ఆఖరి యుద్ధంలో

టీచర్ : స్వాతంత్ర్యం ఇచ్చే సమయంలో ఆ సంతకాన్ని ఎక్కడ చేశారు?

విద్యార్థి : పుస్తకంలోని ఆఖరి పేజీలో.

టీచర్ : విజయాలు రాకపోవడానికి ముఖ్య కారణం?

విద్యార్థి : పరీక్షలు

టీచర్ : బ్రేక్ ఫాస్ట్‌లో ఏం తినలేరు?

విద్యార్థి : లంచ్, డిన్నర్

టీచర్ : నీలి సముద్రంలో ఎర్రరాయి వేస్తే ఆ రాయి ఎలా కనిపిస్తుంది?

విద్యార్థి : తడిగా కనిపిస్తుంది.

టీచర్ : ఒక గోడను పది మంది నాలుగు గంటల్లో కడితే, అదే గోడను ఐదుగురు ఎన్ని గంటల్లో కట్టగలరు?

విద్యార్థి : ముందే గోడను కట్టేస్తే ఇంకెలా కడతారు?

చుక్కలు కలుపుదాం



మొదటిసారి చక్రాన్ని ఎప్పుడు ఉపయోగించారు?

చక్రానికి ఆదిమ సమాజం నుండి పారిశ్రామిక సమాజం అంటే నేటి వరకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఆదిమ సమాజంలో అంటే క్రీ.పూ 3500 వందల సంవత్సరాల క్రితమే మెసపటోమియా ప్రాంతంలో కుండలు తయారు చేయడానికి చక్రాలను ఉపయోగించినట్లు చరిత్ర చెపుతోంది. క్రీ.పూ. 2000 సంవత్సర కాలంలో ఈజిప్టియన్లు ఈ చక్రాలను వాడినట్లు చరిత్ర కారుల దగ్గర ఆధారాలున్నాయి. తర్వాత కాలంలో ఎడ్ల బండ్లకు, రథాలకు, యంత్రాల భాగాలలో ముఖ్యమైన భాగంగా చక్రం ఉంది. పరిశ్రమల్లో పెద్ద పెద్ద యంత్రాలు, జెట్ ఇంజన్లు, కంప్యూటర్ డిస్క్‌ల నుండి చిన్న చేతి గడియాల్లో సైతం చక్రం అవసరం అనివార్యమైంది.



చిరుత

➡ చిరుతపులి పిల్లిజాతికి చెందినది.

➡ నేలమీద నివసించే వాటిలో చిరుతపులి అత్యంత వేగంగా పరిగెత్తే జంతువు.

➡ ఇది గంటకి 113 కిలోమీటర్లు వేగంతో పరిగెత్తుతుంది.

➡ ఇది ఎంత వేగంగా పరిగెత్తగలదో అంతే తొందరగా అలసిపోతుంది.

➡ దీని బరువు 45 నుండి 60 కిలోలు ఉంటుంది.



➡ చిరుతపులి గర్జించదు. గురకపెడుతుది. దీని గురక చాలా పెద్దగా ఉంటుంది.

➡ అడవిలోని మిగతా జంతువులన్నీ రాత్రిపూట వేటాడితే చిరుత మాత్రం తన ఆహారపు వేట పగలే చేస్తుంది. ఎందుకంటే రాత్రిపూల అది సరిగా చూడలేదు.

➡ చిరుత చూపు ఎంత శక్తివంతమైనదంటే ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నవి కూడా దానికి కనిపిస్తాయి.

➡ ఇది మూడు నాలుగు రోజులకొకసారి మాత్రమే నీళ్లు తాగుతుంది.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

'బానిసవ్యవస్థ' లాంటి ఆర్థిక వర్గీకరణలను సరిగా అర్థం చేసుకోనందుకు కూడా ప్రుధోను విమర్శించాడు మార్క్స్. "ఆధునిక పారిశ్రామిక వ్యవస్థకు యంత్రీకరణ ఎంత సహాయం చేసిందో, బానిస వ్యవస్థ కూడా అంతే సాయం చేసింది. బానిస వ్యవస్థ లేకపోతే పత్తి సేకరణ లేదు. పత్తి లేకపోతే ఆధునిక యంత్రీకరణ జరిగేది కాదు. బానిస విధానం వల్లనే వలసలు పెరిగాయి. వలస దేశాలు ఏర్పడ్డాయి. బానిసల వల్లనే అక్కడి సంపద పెరిగింది. వలస దేశాల వల్లనే అంతర్జాతీయ వాణిజ్యం ఆవిర్భవించింది. అంతర్జాతీయ వాణిజ్యం లేకపోతే బడా పరిశ్రమలు వచ్చేవే కావు."

అంతటితో ఆగలేదు. ప్రుధోను ఎండగడుతూ మరో పుస్తకం 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ' రాశారు. ఇందులో ప్రుధోని విమర్శించడం ఒక పార్శ్వం మాత్రమే. ఆ క్రమంలో తన సొంత చారిత్రక, ఆర్థిక, విప్లవ సిద్ధాంతాలను కూడా వివరించాడు మార్క్స్. తాను సొంతంగా రాసిన తొలి పుస్తకమిది. ఇందులోనే తొలిసారిగా తాను 'ఏకానమిస్టు' నని ప్రకటించుకున్నాడు.

"బూర్జువా ఉత్పత్తి సంబంధాలలో ఒక వైరుధ్యం ఉన్నదని స్పష్టమవుతోంది. సంపదను పెంచిన ఉత్పత్తి సంబంధాలే పేదరికాన్ని సృష్టించాయి. అభివృద్ధి జరిగిన దశలోనే వెనకబాటుతనమూ పెరిగింది. బూర్జువా సంపదను, బూర్జువా వర్గాన్ని సృష్టించిన సంబంధాలే కార్మిక వర్గాన్నీ సృష్టించాయి.

ప్రుధో రాసిన పుస్తకం (ది ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ) ఫ్రాన్సులో బాగా అమ్ముడుపోయింది. జర్మన్‌లోకి కూడా అనువాదమైంది. కాని మార్క్స్ విమర్శనా గ్రంథం 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ ' కి మాత్రం పబ్లిషర్ దొరకలేదు. అయితేనేం డబ్బుల కోసం కటకటగా ఉన్న దశలో కూడా సొంత ఖర్చులతో ఎనిమిది వందల ప్రతులు అచ్చు వేయించాడు. పెద్దగా అమ్ముడు పోలేదు. కాని మార్క్స్ అవగాహనా క్రమంలో ఇదో ముఖ్యమైన రచన. దీనితో ఆయనకో స్పష్టత వచ్చింది. ఇన్నాళ్ళూ పాత సోషలిజం, కమ్యూనిజం, హెగెలియజం, క్రిస్టియానిటీ, జుడాయిజంలకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో విజయం సాధించాడు. నూతన రాజకీయ-ఆర్థిక-సామాజిక వ్యవస్థల గురించి తన సిద్ధాంతాలు ప్రతిపాదించటానికి మార్గం సుగమమైంది. కేవలం సిద్ధాంతాలు కాదు - సామాజిక మార్పుకు కార్యాచరణ అంతకన్నా ముఖ్యం.

చారిత్రకంగా యిక తనకు తాను విప్లవీకరించుకునే సమయం వచ్చింది. ఈ ఆలోచనతో తనూ, జెన్నీ, బ్రసెల్స్‌లో వున్న ఇతర మిత్రులూ 'లీగ్ ఆఫ్ జస్ట్'లో సభ్యత్వం తీసుకున్నారు.

బ్రసెల్స్, 1847

'లీగ్ ఆఫ్ దిస్ట్' కేంద్ర కార్యాలయం పారిస్‌లో ఉంది. కాని 1846 శిశిర కాలం వరకు పోలీసుల బెడద పెరగడంతో, ముఖ్య సభ్యులందరూ ఫ్రాన్సు విడిచి వెళ్ళారు. లండన్‌లో ప్రభుత్వ ఆంక్షలు లేవు. స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. మరో ముఖ్య కారణం ఇక్కడ ఈ సంస్థకెవరూ అంత ప్రాముఖ్యత ఇవ్వరు.

1846 ప్రారంభంలోనే మార్క్స్, లీగ్ ఆఫ్ దిజస్ట్‌ను తమ కరస్పాండెన్స్ కమిటీతో కలిసిపొమ్మని అడిగాడు. కాని తోటి సోషలిస్టులు, కమ్యూనిస్టుల పట్ల అంత దురుసుగా ప్రవర్తిస్తున్న ఈ ముక్కోపితో కలిసి పనిచెయ్యటం వీలు పడుతుందా? లీగ్ మొదట ఈ ప్రతిపాదనను నిరాకరించినా, ఊహాజనితమైన లక్ష్యాల కోసం కాక, శాస్త్రీయ అవగాహనతో పని చెయ్యవలసిన అవసరం ఉందన్న మార్క్స్ వాదన్ను అంగీకరించారు. 1847 ఫిబ్రవరిలో జోసెఫ్ మాల్ అనబడే లీగ్ ఆఫ్‌దిజస్ట్ సభ్యుని కోరిక మన్నించి మార్క్స్, ఎంగెల్స్‌లు ఆ సంస్థతో కలిసి పని చేయటానికి అంగీకరించారు.

ఊహాలోకాల్లో బతకొద్దని మార్క్స్ హెచ్చరించటానికి కారణం అప్పటి ఆర్థిక, వ్యవసాయక సంక్షోభం. యూరోప్ అంతటా పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు కరవుతో అల్లాడుతున్నారు. ఫలితంగా ఎవరికోసం పని చెయ్యాలనుకుంటున్నరో, వారిని ఆకర్షించలేకపోయింది లీగ్. 1845లో ప్రారంభమైన బంగాళాదుంప తెగులు ఇతర పంటలకూ పట్టి చీడపీడలతో చిన్న రైతులు నిలువునా మునిగారు. దీనికితోడు ప్రభుత్వాలు పెద్ద రైతులకనుకూలంగా కొత్త వాణిజ్య విధానం ప్రకటించాయి. దాంతో రైతులు తమ ఉత్పత్తులను స్థానిక మార్కెట్లలో అమ్మటానికి బదులు విదేశీ మార్కెట్లకు తరలించడం ప్రారంభించారు. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. దివాళా తీసిన చిన్న రైతులు, వ్యాపారస్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. కాస్త వున్న వాళ్ళకు కూడా ఆహారం తప్ప మరే వస్తువులూ కొనే స్తోమత లేకుండా పోయింది. దాంతో వ్యాపారస్తులు దివాళా తీయటానికి దారితీసింది. నగరాలలో క్షామ పరిస్థితులు కనిపించాయి. చలికాలం, పారిస్‌లోని పది లక్షల మందిలో మూడవవంతు జనాభా స్థానిక దాతలు, కాథలిక్ చర్చి, ఇతర సేవా సంఘాల ఉచిత భోజన సౌకర్యాల మీద బతికారు. ఆహార దాడులు జరిగాయి. కార్మికులు సమ్మె చేశారు. పరిస్థితి చేయిదాటకుండా వుండాలని, ప్రభుత్వం కొంత ఆహార నిల్వల్ని, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు తరలించింది. ఇది పరిష్కార మార్గం కాకపోగా... గ్రామాల్లో యుద్ధ వాతావరణం ఏర్పడటానికి ప్రధాన కారణమైంది.

'పాత వ్యవసాయ పద్ధతులకు చరమగీతం పాడిన చారిత్రక క్షణమిది' అని వ్యాఖ్యానించారొకరు. కేవలం పంట దిగుబడుల మీద ఆధారపడి కుటుంబాల హోదా పెరిగింది లేదా తగ్గింది. డబ్బు సంపాదించాలంటే యిక వ్యవసాయం లాభం లేదు. మంచికో, చెడుకో వ్యాపారాన్ని నమ్ముకోవాలి. కాని 1847లో యూరోపియన్లు ఈ రెండు రంగాల్లోనూ దగా పడ్డారు.

మార్క్స్ సభ్యత్వం తీసుకున్న తొలి కార్మిక సంస్థ లీగ్ ఆఫ్ జస్ట్. నిజానికి ఆయనకు సంస్థలన్నా, బహిరంగ రాజకీయాలన్నా యిష్టముండదు. స్వభావరీత్యా అతడు రచయిత, మేధావి. సంస్థాగత జీవితానికి అవసరమైన వ్యవహార చతురత, సహనం అతడికి లేవు. తన ఇష్టానికి వ్యతిరేకంగా, మార్క్స్ జీవితాంతం ఏదో ఒక సంస్థతో ముడిపడే వున్నాడు. అంతేకాదు. నాయకత్వ బాధ్యతలు కూడా నిర్వహించాడు.

మార్క్స్ మూడవ సంతానం ఎడ్గార్ ఫిబ్రవరి 3 నాడు జన్మించాడు. కుర్రవాడు అందగాడేమీ కాదు గాని జెన్నీ వాణ్ని ముద్దుగా 'లిటిల్ మాన్‌స్టర్' అని పిలిచింది. మార్క్స్ కూడా పుత్రోత్సాహంతో ఉల్లాసంగా వున్నాడు. మరోపక్క ఆర్థిక సమస్యలు వెంటాడుతూనే వున్నాయి. ఇప్పుడు ఇంట్లో ముగ్గురు పిల్లలూ, అయిదుగురు పెద్దవాళ్ళూ (లెంచెన్, పాలదాయి, జెన్నీ తమ్ముడు ఎడ్గార్ వెస్ట్ ఫాలెన్‌తో కలిసి), ఉత్తర ప్రత్యుత్తరాల ఖర్చు కూడా పెరిగిపోయింది. (పారిస్‌లో పార్శిల్ పంపాలంటే ఆరు ఫ్రాంకులు చెల్లించాలి) కుటుంబ సభ్యులే కాక, భోజన సమయంలో టేబుల్ దగ్గర వున్న వాళ్ళందరికీ ఏదో ఒకటి కొనాలి. ఎన్ని ఇబ్బందులున్నా, తమ ఖర్చుల

గురించి ఎవరికీ చెప్పుకోలేదు. మార్క్స్, జెన్నీ, మార్క్స్ అవమానించటంతో బాధపడ్డ వేట్లింగ్, ఆ తర్వాత రోజు వాళ్లతో కలిసే లంచ్ చేశాడు! ఉద్యమం వ్యక్తి కన్నా గొప్పది కనుక త్యాగం చెయ్యక తప్పదనే వాడు మార్క్స్. ఎంగెల్స్ ద్వారా పారిస్‌లో మిత్రుల నుండి రావాల్సిన బాకీ డబ్బులు కొన్ని రాబట్టుకున్నాడు. అవేపాటికి సరిపోతాయి. 'పొలిటికల్ ఎకానమి' పుస్తకం ద్వారా రావు. ఫిబ్రవరిలో ఈ విషయమై కుదుర్చుకున్న ఒప్పందం రద్దు చేసుకున్నాడు పబ్లిషర్. ఆ ఆదాయం వస్తుందనుకొని చేసిన అప్పులు మాత్రం మిగిలాయి.

త్యాగం అనివార్యం. కాని లేఖల్లో, మార్క్స్ అనుభవిస్తున్న కష్టాల్ని పట్టించుకున్నట్టు కనపడదు. కొన్నిసార్లు జెన్ని గురించి విస్మరించినట్టే వుంటుంది. సోషలిస్టులతో సంబంధాలు పెంచుకుంటూ, కార్మికుల్లో రాజకీయ చైతన్యం పెంచుతూ ఇంకా పారిస్‌లోనే వున్నాడు ఎంగెల్స్.

మార్చిలో రాసిన ఒక లేఖలో, రాజకీయ పరిస్థితి ఆందోళనకరంగా మారబోతుందని మార్క్స్‌ను హెచ్చరించాడు. "పోలీసులు రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తిస్తున్నారు. ఆహార కొరత సాకుగా అల్లర్లు చెలరేగితే ఎర్పడే పరిస్థితిని వాళ్లకనుకూలంగా మార్చుకోవాలనుకుంటున్నారు". కొందరు కమ్యూనిస్టుల్ని అప్పటికే అరెస్టు చేశారు. మరికొందరిపై కేసులు పెట్టారు. 'బోరింగ్' బ్రసెల్స్‌ను వదిలి పారిస్‌కు రమ్మని మార్క్స్‌కు గాలం వేశాడు ఎంగెల్స్. అయితే కారణం విప్లవ విధ్వంసం కాదు. ఒకవేళ అది విధ్వంసమే అనుకుంటే సంసారాలను కూల్చే విధ్వంసం. ఏప్రిల్‌లో తనకు డబ్బులొస్తాయి. "ఇంకేం, మనం అన్నీ మరచి ఎంజాయ్ చేయవచ్చు.... అన్ని విషయాలూ మాట్లాడుకోవటానికి నా మిత్రబృందంలో మీరు తప్ప ఎవరూ లేరు. తప్పక రావాలి." అంటూ ఉత్తరం రాశాడు ఎంగెల్స్.

అయినా సరే, మార్క్స్ పారిస్‌కు వెళ్లలేదు. వెళ్లటానికి ఆయన దగ్గర డబ్బూ లేదు. సమయమూ లేదు. బెల్జియంలో కూడా రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా వుంది. ప్రష్యన్ ప్రభుత్వం, అక్కడ వుంటున్న తన పౌరులు యిచ్చిన వాగ్దానాలను ఉల్లంఘించి రాజకీయాల్లో పాల్గొంటున్నారని ఆరోపించింది. 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ ప్రచురించమని మార్క్స్ అడిగిన జర్మన్ పబ్లిషర్ కార్ల్ వాగ్లర్‌ను ఏప్రిల్‌లో అరెస్టు చేశారు. బెల్జియన్ ప్రతిపక్ష పార్టీ వార్తా పత్రిక డాయిష్ బ్రసెలర్ జైటుంగ్‌కు వ్యాసాలు రాయటం ప్రారంభించాడు మార్క్స్. అవి రాజకీయ పరమైన ఆర్టికల్స్ కానప్పటికీ, అధికారుల దృష్టిని ఆకర్షించాయి. తన మీద నిఘా పెరిగిందనిపించింది.

జూన్‌లో లీగ్ సభ్యులు, సంస్థాగత విషయాలు చర్చించటానికి లండన్‌లో సమావేశం కాబోతున్నారు. పారిస్ రావాలని ఉన్నా వచ్చే పరిస్థితిలో లేనని ఎంగెల్స్‌కు స్పష్టం చేశాడు మార్క్స్. (పావర్టీ ప్రచురణ డబ్బులు తనే భరిస్తున్నాడు.) పాస్‌పోర్ట్ సమస్య కూడా వుంది. మరో పక్క అధికారులు కన్నేసి ఉంచారు. ఏ చిన్న కారణం దొరికినా తనను ఇబ్బంది పెట్టడం ఖాయం. బ్రసెల్స్ శాఖ ప్రతినిధిగా లూపస్, ఫ్రెంచి ప్రతినిధిగా ఎంగెల్స్ వెళ్ళాలి.

డజన్ల కొద్దీ లీగ్ సభ్యులు లండన్‌లోని ఒక ప్రైవేటు గదిలో సమావేశమై (జూన్ మొదటి వారంలో) అనేక నిర్ణయాలు తీసుకున్నాడు. మొదట పేరు మారింది. లీగ్ ఆఫ్ జస్ట్ ఇప్పుడు కమ్యూనిస్ట్ లీగ్ అయింది. నినాదం అస్పష్టమైన 'ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్' నుండి 'వర్కింగ్ మెన్ ఆఫ్ ఆల్ కంట్రీస్ యూనైట్'– ప్రపంచ కార్మికులారా ఏకం కండి–గా మారింది. ఈ కొత్త రూపంలో యిది చరిత్రలోని తొలి అంతర్జాతీయ కమ్యూనిస్టు మరియు సంస్థ. కమ్యూనిస్టు ప్రణాళిక డ్రాఫ్టు చేసే పనిని ఎంగెల్స్, మోజెస్ హెస్, కార్ల్ షాపర్‌లకు అప్పగించారు. దీని మొదటి ముసాయిదా, కమ్యూనిస్టులంటే ఎవరు, వాళ్ళ లక్ష్యాలు, కార్మిక చరిత్ర, విప్లవ పథ నిర్దేశం వగైరాలను ప్రశ్నలు–జవాబుల రూపంలో పొందుపరిచారు. సమావేశానికి హాజరు కాని వాళ్ల కోసం వీళ్లు ఒక సర్క్యులర్ కూడా తయారు చేశారు.

"సోదరులారా మేం ఒక అద్భుతమైన, మహత్తరమైన లక్ష్యం కోసం సమావేశమయ్యాం. విప్లవ శంఖారావమే మా నినాదం..." అంటూ సాగిందాసమావేశం. ఆ పదాడంబరం అందర్నీ ఉత్తేజితుల్ని చేసింది. ప్రపంచాన్ని మార్చటానికి బయల్దేరారు కమ్యూనిస్టు లీగ్ సభ్యులు. కాని అది పిట్ట కొంచెం కూత ఘనం కన్నా ఎక్కువేమీ కాదు. అసలు, వాళ్ల సంఖ్యే బహు స్వల్పం. ఒక బెర్లిన్ పోలీస్ అధికారి ఇచ్చిన రిపోర్టు ప్రకారం అంతా కలిసి ఎనభై నాలుగు మంది ఉన్నారు. బ్రసెల్స్‌లో ప్రారంభమైనప్పుడు పద్దెనిమిది మంది మాత్రమే ఉన్నారు. అందులో మొదటి పేరు జెన్నీదే. అందులో ఆమె సోదరుడు ఎడ్గార్, ఎంగెల్స్ కూడా ఉన్నారు గనక, ఇతర్లు పద్నాలుగు మందేనన్నమాట. 1847లో 'కమ్యూనిస్టు విప్లవ సైనికుల' పరిస్థితి అది.

బ్రసెల్స్‌లో, లీగ్‌లో వున్న వాళ్లంతా జర్మన్లు, మార్క్స్‌కు సన్నిహితులు. పైగా మార్క్స్ దానికి అధ్యక్షుడు. పెద్దగా అసమ్మతి లేదు. ఒక యిరుకు గదిలో సమావేశాలు జరిగినా అప్పటికది కమ్యూనిస్టు కేంద్రమే. ఆ రోజులను గుర్తు చేసుకుంటూ "నిబద్ధత కలిగిన గొప్ప కమ్యూనిస్టు జెన్నీ. మార్క్స్ కృషితో మమేకమై పని చేసింది. మార్క్స్ ఆమెనెంతగా ప్రేమించాడో, అతడి కార్యదీక్షను ఆమె అంతగా ఆరాధించింది" అన్నాడొక సభ్యుడు.

బ్రసెల్స్‌లో పరిస్థితులు త్వరత్వరగా మారిపోతున్నాయి. డాయిష్ బ్రసెలర్ జైటుంగ్ ప్రచురణ కర్త, మార్క్స్‌కు సర్వాధికారాలూ ఇచ్చాడు. విద్యావంతులైన కార్మికులలో చైతన్యం పెంపొందించటానికి, మార్క్స్, ఎంగెల్స్ జర్మన్ వర్కర్స్ యూనియన్ స్థాపించారు. ప్రతి బుధవారం ఒక హోటల్లో, మార్క్స్ చారిత్రక భౌతికవాదం, పెట్టుబడిదారుల దోపిడీ గురించి ఉపన్యసించాడు.

వార్తా పత్రికలలోని మార్క్స్ రాతలు పోలీసుల దృష్టిలో పడ్డాయి. ఒక అధికారి నివేదిక ప్రకారం :

"ఈ పత్రిక విష ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నది. కార్మికులు, సంపదకు హక్కుదారులని వాళ్లలో ప్రభుత్వం ధనికుల పట్ల ద్వేషం పెంచుతున్నది. వీళ్ల సంఘంలోని సభ్యుల సంఖ్య ముప్పై ఏడు నుంచి డెబ్బైకి పెరిగింది. ఇది ఆందోళన కలిగించే విషయం..."

సభ్యుల సంఖ్య త్వరలో వందకు చేరుకుంటుందని హెర్వీగ్‌కు చెప్పాడు మార్క్స్.

సెప్టెంబర్‌లో వారసత్వంగా తనకు వచ్చే వాటా గురించి మాట్లాడటానికి హాలెండ్ వెళ్లాడు మార్క్స్. 1845 నుండీ కేవలం ఒక ప్రచురణకర్త ఇచ్చిన అడ్వాన్సుతో మాత్రమే నెట్టుకొచ్చారు. దంపతులు(పుస్తకం వెయ్యటం లేదు. గనుక అతను అడ్వాన్సు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నాడు.), డిసెంబర్‌లో ఒక సంవత్సరం అద్దె కట్టాలి. అదే నెలలో కమ్యూనిస్ట్ లీగ్ సమావేశానికి మార్క్స్ లండన్‌కు వెళ్లాల్సి వుంది.

కొంతకాలం క్రితం బ్రసెల్స్ వచ్చిన బకూనిన్ గొడవలు సృష్టించాడు. అతనికి మార్క్స్ అంటే పడదు. ఇప్పుడు వేట్లింగ్‌నూ, ప్రూధోనూ అనుమానించాడని కోపం పెంచుకున్నాడు. మార్క్స్ అధ్యక్షుడిగా డెమోక్రటిక్ అసోసియేషన్‌లో బకూనిన్ సభ్యత్వమైతే తీసుకున్నాడు గాని అక్కడి క్రమశిక్షణ అతడి స్వభావానికి సరిపడదు. మార్క్స్‌నూ, ఇతరులనూ పడక్కుర్చీ విప్లవకారులని ఎద్దేవా చేశాడు. "మాటిమాటికీ బూర్జువాలంటూ నిందిస్తారు గాని వీళ్లూ బూర్జువాలే...."

హాలండ్‌లో మార్క్స్‌కు డబ్బు దొరుకుతుందనే వాగ్దానం లభించింది గాని అప్పటికి ఖాళీ చేతుల్తోనే తిరిగి వచ్చాడు. బ్రసెల్స్ అనూహ్యమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలిసినా, లీగ్ సమావేశం యొక్క అవసరాన్ని గుర్తించి, భార్యను ఒంటరిగా వదిలి, లండన్‌కు బయల్దేరాడు మార్క్స్. ఆ సందర్భంగా పారిస్‌లో వుంటున్న పావెల్ అన్నెకోవ్‌కు ఇలా రాశాడు.

"నా ఆర్థిక స్థితి దారుణంగా వుంది. అప్పుల వాళ్లు నా భార్యను రోజూ వేధిస్తున్నారు. అడగాలంటే సిగ్గుగా వుందిగాని, నా భార్యకు వందో రెండు వందలో ఫ్రాంకులు పంపగలిగితే, నాకు మహోపకారం చేసిన వాడవవుతావు. అయితే మొత్తం నేను త్వరగా తిరిగి ఇవ్వలేను. ఆర్థిక స్థితి మెరుగుపడిన తర్వాత మాత్రమే బాకీ తీర్చగలను "

ప్రతిపాదన అంగీకరిస్తే, అన్నెకోవ్ ఆ డబ్బు జెన్నీకి పంపాలి. "నేనీ ఉత్తరం రాసిన విషయం నా భార్యకు తెలియకూడదు. మంచి వార్తలు మరోసారికి..."

నవంబర్ 27 నాడు, మార్క్స్, ఎంగెల్స్, జార్జి వీర్త్‌లు బెల్జియంలోని 'ఓస్టెండ్' నగరంలో డోవర్‌కు వెళ్లటానికి స్టీంషిప్ ఎక్కారు. అందరూ ఆ తర్వాత లండన్ చేరుకోవాలి. వివిధ సంస్థల వాళ్లు లీగ్ సమావేశం తర్వాత, నవంబర్ చివరలో అత్యంత క్రూరంగా అణచివేయబడిన పోలిష్ తిరుగుబాటును సంస్మరిస్తూ ఉత్సవాలు చేసుకోవాలనుకున్నారు. యూరోప్‌లోని రాడికల్సందరినీ ఐక్యం చేయగల అంశం పోలిష్ తిరుగుబాటు.

ఫ్రెంచి, బెల్జియన్, ఇటాలియన్, డేనిష్, ఇంగ్లిష్ సానుభూతి పరులందరూ కలిసి సోహోలోని గ్రేట్ విండ్‌మిల్ వీధిలోని ఒక హోటల్లో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.

(సశేషం)

నన్ను నేను విముక్తి చేసుకునేందుకే రాస్తాను

నోబెల్ బహుమతి పొందిన మొదటి జర్మనీ యూదు కవయిత్రి నెల్లీ సాచ్స్. నాజీల చేతుల్లో మారణహోమం నుండి బతికి బయటపడ్డ సాచ్స్ జర్మనీ బెర్లిన్‌లో 10 డిసెంబరు 1891లో జన్మించారు. వీరి తండ్రి జార్జ్ విలియం సాచ్స్ (1858-1930) ఆవిష్కర్త, ప్రముఖ పారిశ్రామికవేత్త. తల్లి మార్గరెట్ (కార్గెర్) సాచ్స్ (1871-1950). తల్లిదండ్రులకు నెల్లీ ఒక్కరే బిడ్డ. ఆకాలిటనీ నెల్లీ సాచ్స్.

సాచ్స్ ఇంటిలో వస్తువులన్నీ లూటీచేయబడ్డాయి. ఇరుగుపొరుగువారు సైతం దొరికిందల్లా దోచుకున్నారు. మిగిలిన బట్టలతో ఒక పెట్టెతో బయటపడి 16 మే 1940 న చివరి విమానం ఎక్కి, సాచ్స్ స్వీడన్ స్టాక్ హోం చేరేసరికి, మృత్యువు కోరల్నుండి తనని రక్షించిన తన కలం స్నేహితురాలు లోగెర్లోఫ్ మరణించారు.

సంపన్న కుటుంబం కావటాన బాల్యంలో సాచ్స్‌ని చదువుల కోసం తండ్రి ఇంటి నుండి బయటకు పంపి చదివించ లేదు. సకల సౌకర్యాలూ ఇంట్లోనే కలగజేసి, విద్యాబోధన ఇంటిలోనే జరిపారు. చాలా సున్నితంగా, అల్లారు ముద్దుగా పెరిగారు. బాల్యంలో సంగీతం నృత్యం కూడా నేర్చుకున్నారు. కాస్త పెరిగి పెద్దయాక, బెర్లిన్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. సాహిత్యం పట్ల ఆమె మక్కువకి కారణం తండ్రి ప్రోద్బలం. పదిహేడేళ్లకే ఆమె కవిత్వం రాయటం మొదలైంది. కానీ ఎక్కువగా అవి తన సంతృప్తి కోసం రాసుకున్నవి. మొదట్లో ఇష్టపడ్డ జర్మనీ కాల్పనిక కవుల ప్రభావంతో కవితలు రాసారు. బెర్లిన్‌లో అప్పట్లో ప్రాచుర్యంలో ఉన్న భావప్రకటన వాద కవిత్వం ఆమె మీద ప్రభావం చూపలేదు. ఆ కారణంగానే 1921లో వచ్చిన ఆమె మొదటి కథల పుస్తకం "పురాణగాథలు వృత్తాంతాలు" గానీ, వివిధ పత్రికలలో ప్రచురించబడ్డ కవితలు గానీ, గుర్తింపుకు నోచుకోలేదు. ఆమెలోని ప్రతిభను మొదట గుర్తించి ఆమె కవితలు ప్రచురణకు సహకరించింది రచయిత స్టీఫన్ జ్వైగ్ (1881-1942). 1929లో ఆమె మొదటి కవిత ప్రచురణకు నోచుకుంది. వాటిల్లో క్రైస్తవుల మార్మికత ఎక్కువ. ఆమె 15 ఏళ్ల ప్రాయంలోనే స్వీడన్ నవలా రచయిత్రి, నోబెల్ బహుమతి గ్రహీత సెల్మా లోగెర్లోఫ్ (1858-1940) నవల "గోస్టా బెర్లింగ్ సగా" తో అత్యంత ప్రభావితురాలయి, ఆ తరువాత ఆమెతో 35 ఏళ్ల పాటు ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించారు.

1930లో కేన్సర్ మూలంగా తండ్రి చనిపోయాక, తల్లితోబాటు ఉంటూ, యూదుల సాంస్కృతిక సంఘంలో చురుకుగా పాల్గొంటూ, కవయిత్రి గెర్ట్రుడ్ కొల్మర్ (1894-1943)తో బాటు సాచ్స్ కవిత్వ పఠనం చేసేవారు. 1933లో నాజీలకు అధికారం హస్తగతమయ్యాక, సాచ్స్ జీవితం ఎక్కువగా ఏకాంతంలోకి నెట్టబడింది. యూదులు పట్ల నాజీల వ్యతిరేకత తీవ్రమయింది. వారి క్రూరమైన రహస్య పోలీసు విభాగం 'గెస్టపో' సాచ్స్‌ను, సాచ్స్ తల్లినీ భయభ్రాంతులు చేయడం మొదలెట్టింది. మొదటి మారు వీరిని పోలీసులు ప్రశ్నించినపుడు, అయిదారు రోజుల వరకు సాచ్స్ ఎవరితోనూ మాట్లాడలేకపోయారు. ఆ సమయంలో "జవాబేదీ తెలియక తన స్వరం పారిపోయిందని" ఆ తరువాత రాసుకున్నారు. 1937లో తన సన్నిహిత స్నేహితునితో బాటు నిర్బంధించబడ్డారు. ప్రతిఘటన ఉద్యమంలో పాల్గొన్న ఆ స్నేహితుని గుర్తింపు ఎప్పుడూ ఆమె బహిరంగపర్చలేదు.

యూదు కాని ప్రియునితో తన ప్రేమ వ్యవహారాన్ని సాచ్స్ తండ్రి అంగీకరించలేదు. తండ్రి మరణం తరువాత ఆ ప్రేమని కొనసాగించినా, అతను మారణహోమంలో చంపబడ్డాడు. ఆ సమయంలోను ఆ తరువాత కవితల్లోనూ తనకు జరిగిన నష్టం ఏకాంతం వ్యక్తమవుతూనే ఉండేవి. 1947లో వచ్చిన "మరణించిన వరుడి కోసం ప్రార్థనలు" అతనికే అంకితం ఇచ్చింది. అయినా ఆమె స్వీయ జీవిత విషయాలు ఎక్కువగా ఎప్పుడూ వెల్లడి చేయలేదు. జీవితాంతం సాచ్స్ అవివాహితగానే ఉండిపోయింది. "నా ప్రజల ప్రారబ్ధం లాగే, నా ప్రారబ్ధం కూడా ఒంటరే" అని ఆమె చెప్పుకున్నారు.

1940 లో చిత్రహింసల శిబిరానికి రావల్సిందని, సాచ్స్‌కు సాచ్స్ తల్లికీ కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. వారం రోజుల్లో అక్కడికి చేరాల్సిందే. అయితే అదృష్టం కొద్దీ సాచ్స్ స్నేహితురాలొకామె ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి స్వీడన్ చేరుకుని, సాచ్స్ కలం స్నేహితురాలు, 1909లో నోబెల్ బహుమతి గ్రహీత సెల్మా లోగెర్లోఫ్‌ని కలుసుకుంది. ఆమె ద్వారా స్వీడన్ యువరాజు యూగెన్ (1865-1947)ని అర్థించి, సాచ్స్ తల్లితో బాటు స్వీడన్ వచ్చేందుకు వీసాను మంజూరు చేయించ గలిగింది. అప్పట్లో యూదుల్ని అలా రప్పించగలగటం చాలా వరకు అసంభవమైన పని. సాచ్స్ ఇంటిలో వస్తువులన్నీ లూటీచేయబడ్డాయి. ఇరుగుపొరుగువారు సైతం దొరికిందల్లా దోచుకున్నారు. మిగిలిన బట్టలతో ఒక పెట్టెతో బయటపడి 16 మే 1940 న చివరి విమానం ఎక్కి, సాచ్స్ స్వీడన్ స్టాక్ హోం చేరేసరికి, మృత్యువు కోరల్నుండి తనని రక్షించిన తన కలం స్నేహితురాలు లోగెర్లోఫ్ మరణించారు. సాచ్స్ మిగిలిన కుటుంబ సభ్యులెవరూ జర్మనీలో మారణహోమాన్ని తప్పించుకోలేకపోయారు. సాచ్స్ జీవితంలో కోలుకోలేని దెబ్బలవి.

స్వీడెన్ చేరుకునే సరికి సాచ్స్ వయస్సు 50 సంవత్సరాలు. ఏదో చిన్న గదిలో తల్లీ కూతురు ఉండేవారు. జీవనోపాధి కోసం మొదట్లో వీరివి వారివి బట్టలుతికే వారు. స్వీడన్ భాష నేర్చుకున్నాక, జర్మనీ నుండి స్వీడన్‌లోకి అనువాదాలు చేస్తూ కాలం గడిపారు. స్వీడన్ నుండి, గున్నర్ ఎకెలోఫ్ (1907-1968), ఎరిక్ లిండెగ్రెన్ (1918-1996), జోహన్నెస్ ఎడ్ఫెల్ట్ (1904-1997) లాంటి కవుల్ని జర్మనీలోకి అనువాదం చేసారు.

జర్మనీలో ఉండగా యూదుల ఆరాధనలకు, ఉత్సవాలకూ ఎప్పుడూ పోని సాచ్స్, మార్టిన్ బబెర్ (1878-1965) యూదుల మార్మిక కథలతో

అత్యంత ప్రభావితులయ్యారు. స్వీడన్‌లో గెర్షోంస్కోలెం (1897–1982) యూదుల కబాలీ మార్మికత పట్ల ఆకర్షితులయ్యారు.

కవయిత్రిగా గుర్తింపు సాచ్స్‌కు ప్రవాస జీవితంలోనే మొదలయింది. 1947లో వచ్చిన "మృత్యు వాసాల్లో" ఈమె మొదటి కవితా సంకలనం. విరివిగా రూపకాలు వాడుతూ ఆధునిక శైలిలో కవితలు రాసినా, భవిష్యత్తును సూచించే ఓల్డ్ టెస్టమెంట్ భాషలోనే అవి నినదిస్తాయి. 1949లో "నక్షత్రాల గ్రహణం" 1957లో "ఎవరికీ తెలీదు ఎక్కడికి పోవాలో", 1959లో "పలాయనం పరిపూర్ణ మార్పు" – వీటన్నింటిలో యూదుల జీవితంలోని తరతరాల బాధ, హింస, ప్రవాసం, మరణాల్ని ధృడపరుస్తూ, తన భావగర్భిత భాషలో ఉంటాయి. కవిత్వ నాటకాల్లో 1950లో వచ్చిన "అలౌకిక ప్రదర్శన ఎలీ" రేడియో నాటకంగా ప్రసారమై అనేక మన్ననలు పొందింది. 1961లో "ఆవలకు ప్రయాణం" పేరు మీద కవితల సంకలనం, కవిత్వ నాటకాలతో "ఇసుకలో గుర్తులు" వచ్చాయి. 1967లో "ఓ పొగ గొట్టాల్లారా" పేరుమీద కొన్ని ప్రసిద్ధ కవితలు ఎలీ నాటకంలో కలిపి వచ్చింది. 1970లో "అభ్యర్థితులు మరి కొన్ని కవితలు" వెలువడింది. ఆమె కవిత్వంలో పునరావృతమయే భావచిత్రాలు–ఇసుక, బూడిద, వ్రేళ్లు, చేతులు, తూనీగలు, నక్షత్రాలు, పక్షులు మొదలైనవన్నీ కాంతిగల నక్షత్రరాసుల్ని తయారుచేసి, అనూహ్యమైనవి అనిర్వచనీయమైన వాటిని సైతం ఊహింపజేస్తాయి. ఆమె కవిత్వం ద్ణుఖిస్తుంది, అయినా మానవత్వం పట్ల నైరాశ్యం చెందదు. ఆ తరువాత రచనల్లో చావు, బాధితుల మధ్య బాంధవ్యం, బాధితుల, నిరపరాధుల నిజస్థితిని చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది.

నోబెల్ బహుమతి మూలంగా అంతర్జాతీయ ఖ్యాతి రాకముందే, సాచ్స్‌కు స్వీడన్, జర్మనీ రెండు దేశాలనుండీ పురస్కారాలు లభించాయి. 1958లో స్వెడిష్ కవుల బహుమతి, 1960లో డ్రొస్టె–హాల్షోఫ్ఫ్ బహుమతి, 1961లో డోర్ట్మండ్ నగర సాహిత్య బహుమతి, 1965లో జర్మనీ పుస్తక విక్రేతల లభించాయి. ఆ శాంతి బహుమతి సందర్భంగా– గతంలో ఎన్ని ఘోరాలు జరిగినా, మిమ్మల్ని నేను నమ్ముతాను.. హతులైనవారిని గుర్తు చేసుకుని, మళ్లీ సరికొత్త ప్రారంభాన్ని కోరుకుంటూ, కలిసి నడుద్దాం భవిష్యత్తులోకి– అని సాచ్స్ అనగలిగింది. గౌరవ పౌరసత్వంతో 1967లో బెర్లిన్ నగరం సాచ్స్‌ను సత్కరించింది.

సాచ్స్ జర్మనీలో రాసినవేవీ ఆమెతో బాటు తెచ్చుకోలేదు. ఆమె పూర్వ సాహిత్యం చాలా వరకూ పోయినట్టే. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలోనూ, ఆ తరువాత వచ్చిన ఆమె కావ్యాలే ఆమెకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చాయి. మార్మికం, దార్శనికం, పరవశత్వంతో నిండి ఉన్న కవిత్వం ఆమెది.

1966లో సాహిత్యానికి నోబెల్ బహుమతి, నెల్లీ సాచ్స్‌తో బాటు, ఇజ్రాయిల్ కథ నవలా రచయిత ష్యామ్యుల్ యోసెఫ్ ఆగ్నన్ (1888–1970)తో కలిపి లభించినపుడు– ఆగ్నన్ ఇజ్రాయిల్ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తే, నేను యూదు ప్రజల విషాదానికి ప్రతినిధినని ఆమె వ్యాఖ్యానించారు. నోబెల్ బహుమతి ప్రదాతలు వీరికి బహుమతి ప్రదానం చేస్తూ సమస్త యూదు ప్రజల విషాదం పట్ల భావోద్వేగ తీవ్రతతో, లయాత్మకంగా బాధాకరమైన అందాన్ని, పౌరాణిక నాటకీకరణలతో, ఆమె ప్రపంచవ్యాప్తంగా తన స్వరం కలిపిందని, వీరి ప్రతీకాత్మక భాష ఆధునికతను సంతరించుకున్న పురాణ కవిత్వం లాంటిదని, ప్రజలతో మమేకమై, వారిమీద నమ్మకాన్ని కొల్పోక, వారి ఆచార వ్యవహారాల్ని, మార్మికతని ప్రతిబింబించి, ప్రపంచ పదచిత్రాలతో, హింసల శిబిరాల్లోని అరాచకత్వాన్ని విస్మరించకుండా, ప్రతిహింసకి అతీతంగా మానవుని నీచంగా చేసిన నిజమైన దు:ఖాన్ని మాత్రమే వీరి రచనల్లో చూడొచ్చు 'అని పేర్కొన్నారు. ఆ బహుమతి మొత్తంలో, పేదలకు సగం, తనను ప్రాణాపాయం నుండి రక్షించడానికి, జర్మనీ నుండి స్వీడన్‌కొచ్చి, చేసిన మరచిపోలేని సహాయానికి గాను తన జర్మనీ స్నేహితురాలు గుడ్రున్ హర్లన్ డహ్నెర్ట్‌కి మరో సగం పంచింది. తన రచనల గురించి– చెప్పలేని విషయాల్ని, ఈ రాత్రుల రాత్రిలో సహించే స్థితితో ఉంచాలని, వణుకు, బాధ దాగున్న పవిత్ర చీకటిని, కొంతయినా పరిచయం చేయాలని, అది వీలైనంత లోకోత్తరంగా చెప్పాలని ప్రతినిత్యం కృషి చేశానని చెప్పారు సాచ్స్. అందరినీ కంటతడి పెట్టించే నెల్లీ సాచ్స్ రాసిన కవిత 'రక్షితుల బృందగానం', అలాగే అందరూ పేర్కొనే వీరి కవిత 'ఓ పొగ గొట్టాల్లారా'లో



సాచ్స్ సంయమనం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆక్రోశం ఉండాల్సిన చోట ఆవేదనని, అప్పటి ఒక వాస్తవాన్ని, మనకు కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. చెడు ఉండకుండా ఉండదని, దాని మూలంగా అనర్థాలు జరగకుండా ఉండవని సాచ్స్ నమ్మకం. అయినా వారిమీద కసితీర్చుకోవాలని, పగతీర్చుకోవాలన్న ప్రయత్నాన్ని గానీ సాచ్స్ ఏనాడూ చేయలేదు.

ప్రవాసంలో ఉన్నప్పుడు మారణహోమంలో చంపబడ్డ నోరులేని బాధితుల సాక్షిగా ఉండటం తన విద్యుక్త ధర్మంగా భావించారు. మాతృదేశంతో తన బంధం కేవలం తాను జర్మనీ భాషలోనే కవిత్వం రాయడం. ఎన్ని కోల్పోయినా పదిలంగా దగ్గరగా ఉండి చేరుకోదగ్గది భాష ఒక్కటే అని స్వీడన్‌లో ఉన్నప్పుడు అను కున్నది. సంచారులు ప్రవాసపు బరువుని కొత్త దేశంలో సామానులా మోసుకు తిరగాలని చెప్పుకుంది. ప్రవాసంలో కొత్త దారుల్లో వాడిపోయిన దాచుకోలేని పేర్లు, మాతృదేశానికి ఎప్పుడూ తీసుకుపోలేవని కూడా రాసుకుంది.

ఆమె మరణించే సమయానికే ఆమె రచనలు 15 భాషల్లోకి అనువదించబడ్డాయి.

ఎలీ నాటకంలో సాచ్స్ స్పష్టపర్చినట్టు– భవిష్యత్తు ద్వేషం, ప్రతీకారం శిథిలాలమీద నిర్మించలేమని, దాని బదులు తన కవిత్వం స్వస్థతచేకూర్చి, పునరుద్ధరించే మూలాధార ప్రతినిధిగా పనిచేస్తుందని ఆశించారు. సాచ్స్ పుట్టిన ప్రాంతంలో జ్ఞాపకచిహ్నం నెలకొలిపారు. బెర్లిన్‌లో ఒక ఉద్యానవనానికి ఆమె పేరు పెట్టారు. స్టాక్ హోం రాయల్ లైబ్రరీలో ఆమె వాడిన టైప్రైటర్‌తో, పుస్తకాలతో ఆమె నివసించిన చిన్న గది నమూనాతో ఒక గది నిర్మించారు. ఆమె నివసించిన గదికి దగ్గరలోనే ఆమె పేరుమీద ఒక ఉద్యానవనాన్ని కూడా నెలకొల్పారు. "ప్రపంచ ప్రజలారా, పదాల విశ్వాన్ని నాశనం చేయొద్దు. జీవితం అని ఎవరైనా అంటే మరణం కాదు, ఊయల అంటే రక్తం కాదు" అని ఒక కవితలో కోరుకుంది, కాదు అనుభవంతో చెప్పుకున్నారామె.

– ముకుంద రామారావు, 9908347273

మనతో సంబంధం లేకుండా రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతుంటాయి. కానీ కాల ప్రవాహంలో మీకు సంతృప్తి కలిగించిన రోజులున్నాయా? ఆశ్చర్యానికీ, ఆనందానికీ లోను చేసిన సందర్భాలున్నాయా? ఊగించి శాసించి ఉక్కిరిబిక్కిరి చేసిన సన్నివేశాలున్నాయా? ఈ 2014లో మిమ్మల్ని కదిపి కుదిపిన ఆనందాలేమిటి? కనీసం మీ వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూసుకోండి. మీ జీవనభాగస్వామి మిమ్మల్ని అత్యంత సంతోషానికీ, వల్లమాలిన అనురాగస్పర్శకీ లోను చేసిన సమయాలున్నాయా? ఒక్కసారి గుర్తు చేసుకోండి.

ఎప్పుడయినా... సరదాగా...

నిత్యనైమిత్తికాలతో రోజులు గడిపేయడం వేరు. మనతో సంబంధం లేకుండా రోజులు మన మీదుగా వెళ్ళిపోతుంటాయి. అయినప్పటికీ ఒక ఏడాదికి మరో ఏడాదికి తేడా ఉండాలి. 2012కి 2013 భిన్నంగా ఉండాలి. 2013కి 2014 మరింత భిన్నంగా, ఆనందంగా కనిపించాలి. అలాంటి ఉద్వేగ, ఉల్లాస సందర్భాలు ఉన్నాయో లేవో గుర్తు చేసుకోండి.

ఎంతకాలం కలిసి జీవించారన్నది కాదు, ఎన్ని సందర్భాల్లో మీకు మీరు ఇద్దరుగా అలవి కాని ఆనందాన్ని, అనుభూతుల్ని పొందారో మీకు ముఖ్యం. పిల్లల్ని కనడం, పెంచడం, పోషించడం, చదువులు చెప్పించడం... లేదంటే బయట ఉద్యోగాలు చేయడం, దందాలు చేయడం, అవసరాల కోసం అగచాట్లు పడటం మామూలే. ఇన్ని సంక్లిష్టతలు, సవాళ్ళ మధ్య కూడా మీకు మాత్రమే మిగిలిన ఆనంద ఘడియలు కొన్నయినా ఉన్నాయా లేవా అన్నది ప్రశ్న.

ఎందుకంటే జీవితంలో ఒకింత ఆశ్చర్యం లేకపోవడం కన్నా విషాదం మరొకటి లేదు. విస్మయాల్లేని బ్రతుకులో థ్రిల్ ఉండదు. అన్నీ ప్లాన్డ్‌గా, ప్రోగ్రామ్డ్‌గా జరగాలనుకుంటారు మనుషులు. తాము ఊహించినట్లుగానే ఎదుటివాళ్ళు ఉండాలనుకుంటారు. తమ చుట్టూ వున్న ప్రపంచం కూడా తాము అనుకున్నట్లుగా నడవాలనుకుంటారు. కానీ ఊహించినవన్నీ జరుగుతూ పోతే ఈ ప్రపంచాన్ని భరించగలమా? ఆలోచించండి ఒక్కసారి. ఏ ఆకస్మిక సంఘటనల్లేకుండా పోతే జీవితంలో మెరుపు ఉంటుందా? కొత్తదనం లేకపోతే స్త్రీ పురుషుల ప్రేమలో ఆనందం ఉంటుందా? రొటీన్‌కి భిన్నంగా... సరదాగా... ఎప్పుడయినా... కొత్తగా ఏమైనా చేయగలరేమో ప్రయత్నించి చూడండి.

– ఆ రోజు మీ జీవన సహచరి ఆఫీసుకి వెళ్ళేప్పుడు ధరించిన డ్రెస్‌ను గుర్తు చేసుకోండి. లేత నీలం రంగు సల్వార్ కమీజులో తను ఎంత అందంగా ఉన్నదో వర్ణిస్తూ మీ ప్రేమనంతా నాలుగు అందమైన వాక్యాల్లో పొదిగి ఓ మెసేజ్ పంపించండి. అది ఆమెకు ఇచ్చే ఆనందం, అనుభూతి ఊహాతీతం.

– ప్రాజెక్టు వర్క్ కోసం బెంగుళూరుకో, అమెరికాకో వెళ్ళిన సహచరుడి/సహచరితో గంటల తరబడి ఛాటింగ్ చేస్తున్నారా? మంచిదే. కానీ సరదాగా ఓ ప్రేమలేఖ రాసి పోస్టు చేయండి. అక్షరాల్లో మీ హృదయం ఒలకాలి. తను లేని సమయాలు ఎంత భారంగా ఉన్నాయో చెప్పాలి. అది చదివి తనంటే అంత ప్రేమ ఉందా అని ఆశ్చర్యపోవాలి. అంతటి భావనా పరంపరతో రాసే ప్రేమలేఖ జీవితపర్యంతం గుర్తుండిపోతుంది.

– ఇద్దరూ కలిసి ఏదైనా టూర్‌కు వెళ్ళినప్పుడు మామూలుగా కన్నా భిన్నమైన డ్రెస్‌లో పర్యటించండి. ఓ రోజు అతనేమో పంచెకట్టి, లాల్చీ ధరించి, మీరేమో జీన్స్, టీషర్ట్ వేసుకొని కలిసి తిరిగితే మీకు మీరే ముచ్చటపడతారు. వీలయితే అతను తలపాగా ధరిస్తే మరీ మంచిది. మీరేమో జడ వేయకుండా జుట్టును అలా గాలికి వదిలేయండి. పల్లెటూరి బైతుతో మోడ్రన్ అమ్మాయి అనుకుంటారా? అనుకోనివ్వండి. సముద్రపు ఒడ్డున ఇలా ఇద్దరూ కలిసి ఓ ఫొటో దిగండి. కలకాలం నిలిచిపోయే సంఘటనగా ఉండిపోతుంది.

– చలిచలిగా ఉండే కాలాన ఆకస్మికంగా అరకు లేదా ఊటీకి వెళ్ళి నాలుగురోజులు గడిపితే ఇద్దరి నడుమ పెరిగే సాన్నిహిత్యం, మనసుల్లో ఒకరిపై ఒకరికి వెల్లువెత్తే మోహంలోని వెచ్చదనం ఓ మధురానుభూతి. అంతదూరం కుదరకపోతే కనీసం ఓ రోజు ముందస్తు ప్లాన్ లేకుండా లాంగ్ డ్రైవ్‌కు వెళ్ళొచ్చు. మొబైల్స్ స్విచాఫ్ చేసి ఇంట్లో పడేయండి. మీ కోసం మీరు గడపండి.

– ఎక్కడినించో వస్తున్నట్టుగా మంద్రమంద్రంగా వినిపించే సంగీతం మీ గదిలో అగరుధూపంలా పరిమళిస్తుండగా ఒక రాత్రంతా స్వీట్ నథింగ్స్‌తో జాగారం చేయండి. ఒకరిపై ఇష్టాల్ని ఒకరు చూపించుకున్న సందర్భాల్ని, ఒకరి స్పర్శలో ఒకరు వీణా తంత్రులైనప్పటి సన్నివేశాల్ని గురించి కబుర్లు ఎన్నో చెప్పుకుంటూ ఏ తెల్లవారుజామునో తెలియకనే నిద్రలోకి జారుకోవాలి.

ఇలాంటి ఆశ్చర్యకరమైన, ఆకస్మికమైన సన్నివేశాలు, సమ్మోహన సందర్భాలు ఏడాదిలో ఒక్కటంటే ఒక్కటి, ఒక్కసారయినా సంభవిస్తే ఆ ఏడాది నుంచి మరో ఏడాదిలోకి ఆనందంగా దూకేయొచ్చు.

– ప్రణీత్

ప్రేమని నువ్వు కొనలేవు. కానీ భారీ మూల్యం చెల్లించుకుంటావు.

ఆనంద జీవితంలో అద్భుత సత్యాలు

ఆచరించాలే గానీ మీ జీవితాన్ని ప్రకాశింపజేసే అద్భుత జీవిత సత్యాలు తెలుసుకోవాలి. అందులో మనం ఎంత మందికి ఉపయోగపడుతున్నాం. ఎవరితో ఎలాంటి ఆలోచనలు చేస్తున్నామో ఒకసారి గ్రహించాలి. అందులో ముఖ్యమైనవి ఏంటనేది మాత్రం చెప్పలేం.

కాలం మనిషికి వరం. కాలంలోని ప్రతిక్షణాన్ని ఉపయోగించుకునేందుకు శతవిధాలా ప్రయత్నించండి. దేన్ని వృధా చేసినా పర్వాలేదు. కాలాన్ని మాత్రం వృధా చేయకండి. అన్ని వ్యాధులకు మందులున్నాయి కానీ, ఈ వ్యాధులన్నిటికన్నా భయంకరమైన వ్యాధి 'బద్ధకం'. దీన్ని వదిలించుకుని ఒళ్ళు విదిలించుకుని అడుగు ముందుకు వేయలేకపోతే జీవితంలో ప్రగతి శూన్యం అవుతుంది సుమా! మంచి ఆలోచనలు మనిషి జీవితానికి ఆభరణాల వంటివి. మన జీవిత పుస్తకంలో మరెన్ని పేజీలు మిగిలి ఉన్నాయో మనకే తెలియదు. అందుకే అందరికీ ఓ చిన్న సలహా... జరిగిన కాలం ఎలాగూ జరిగిపోయింది. ఇక జరగనున్న కాలంలో కనీసం రేపటి నుంచయినా ప్రతి రోజూ ఓ మంచి పని చేయడం అలవాటు చేసుకోండి. ఆ మంచి పని ఏమిటో డైరీలో రాసుకోండి. మంచి అన్న పనికి అర్థం తెలుస్తుంది.

జీవితం అంటేనే రణరంగం. అందులో కూడా శాంతంగా ఉండాలంటే మనసును శాంతంగా ఉంచుకోవాలి. ఓర్పును వయసుతో పాటు పెంచుకోవాలి. ఎంత అసహనాన్ని కల్గించే సందర్భంలోనైనా సహనంగా ప్రవర్తించడం అలవర్చుకోవాలి. ఈ అలవాట్లు చేసుకుంటే జీవితం సుందర స్వప్నం.

కొంతమందికి ఇతరుల్లోని తప్పుల్ని మాత్రమే ఎత్తిచూపే అలవాటు ఉంటుంది. మీకా అలవాటు వుంటే వెంటనే మానేయండి. ఇతరుల్లోని మంచి మాత్రమే చూడండి. చెడుతో మీకు సంబంధం లేనట్లు ప్రవర్తించండి. మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరూ మీకు సహకరించకపోవచ్చు. అంత మాత్రాన వారిని శత్రువులుగా భావించకండి. వారిని దూరం చేసుకోకండి. అంతేకాదు ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు తప్పకుండా వారిని ఆదరించండి. చేతనైన సాయం చేయండి.

ఉదయం లేవగానే మీలోని చెడును పారద్రోలే ఒక నిర్ణయాన్ని ఆ రోజు వరకు పాటించేందుకు ప్రతిజ్ఞ పూనండి. అలా ప్రతి రోజూ ఉదయాన్నే ఓ మంచి నిర్ణయం తీసుకోండి. 365 రోజుల్లో ప్రతి ఉదయం ఐదు గంటలకు లేచి చదువుకుంటాను, ఇక నుండి టీవీ చూడను, నాన్‌వెజ్ ముట్టుకోను, ధూమపానం చేయను, జీవితానికి మేలు చేసే నిర్ణయాలతో ప్రారంభించండి.

ఆల్కహాల్- అనర్థాలు

ఆల్కహాల్ తాగటానికి కొంతమంది చాలా తొందరగా అలవాటు పడుతుంటారు. అది ఎందుకో అర్థం కాదు. కారణం ఏమియై ఉంటుందో ఆలోచించగలరా.. తాగడం వల్ల మనసులోని ఆందోళనకు తాత్కాలికంగా ఉపశమనం కలుగుతుంది. సహజ సిద్ధమైన సిగ్గు, మర్యాద, గౌరవం వంటి లక్షణాలు మద్యం సేవించే వారికి మరచిపోతుంటారు. దీని వల్ల బాధపడడం, దిగులుగా ఉండడం వారికి తెలియదు. దీంతో మొండి ధైర్యం వచ్చేస్తుంది.

దీని కారణం మద్యం మెదడులోని కొన్ని ముఖ్య భాగాల పై పనిచేసి, వాటిని అదుపు తప్పేలా చేస్తుంటాయి. అందుకే తాగిన మనిషి అసభ్యంగా ప్రవర్తిసుంటాడు.

ఎలాంటి పదార్థాలు తిన్నా, తాగినా అవి జీర్ణమై రక్తంలో ప్రవేశించి వాటి ప్రభావం చూపడానికి కొన్ని గంటలు పడుతుంది. కాని మద్యం నోట్లో పోసుకున్నప్పుడే కొంత రక్తంలోని శోషించ బడుతుంది. మద్యం మనిషికి చురుకుదనం పుట్టించదు. మెదడును పూర్తిగా బలహీన పరుస్తుంది. తాగుడుకు అలవాటు పడినవారికి విచక్షణ, జ్ఞాపకశక్తి మందగిస్తుంది. ఆలోచన చేయగల శక్తి, సామర్థ్యం సన్నగిల్లితుంది. దీర్ఘకాల మద్యానికి బానిసలైన వారికి జ్ఞాపక శక్తి పూర్తిగా కోల్పోడానికి అవకాశం ఉంది. మాట మందగించి మనిషి ప్రవర్తన, తీరుతెన్నులు వికృతంగా మారి పూర్తిగా ఉన్మాదుడుగా తయారౌతాడు.

మనిషి తాగే డోసు కొద్దీ అతని ప్రవర్తనలో మార్పు మొదలవుతుంది. రక్తంలో ఆల్కహాల్ స్థాయి పెరుగుతున్న కొద్దీ పాటలు పాడడం, జోకులు విసరడం, తికమకగా మాటలు మాట్లాడం లక్షణాలు మొదలవుతాయి.

మెదడులో ఆలోచన, జ్ఞాపకశక్తి, ఆనందం కోరుకునే భాగాలైన వల్కలం, హిప్పోకాపస్, న్యోక్లియస్ మీద ప్రభావితం చూపుతాయి.

నాడీకణాలు పనిచేయడం మందగిస్తాయి. ఆల్కహాలు నిద్రమాత్రలు మాదిరి ప్రభావం చూపుతుంది.

అతిగా ఆల్కహాల్ తీసుకుంటే లివర్ దెబ్బతింటుంది. దీని వల్ల మూత్ర పిండాలకు, వ్యాధులు, అల్సర్లు కూడా వచ్చి తలనొప్పిగా ఉండటం, కడుపులో అశాంతిగా ఉండడం, వివరించలేని విధంగా శరీరం వణకడం, చెమటలు పటడం, ఆకలి మందగించడం, నిద్ర లేమి చేతులు , కాళ్ల సూదులతో గుచ్చినట్లు బాధ కలుగుతుంది. నీరశం, భయాందోళనలు, మరియు వైవాహిక జీవితానికి దెబ్బ తీసి స్నేహితులను కూడా దూరం చేసుకుంటారు.

ఉద్యోగ విధులకు గైర్హాజరు కావడం, ఉద్యోగాలు మారిపోవడం, పనిలో నాణ్యత కోల్పోవడం, ఏకాగ్రత తగ్గడం , జ్ఞాపకశక్తి క్షీణించడం, అసహ్యాంగా అనారోగ్యంతో ఉండడం సంభవిస్తుంది.

- బి. భాస్కర్, ధర్మన్న గూడ

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

సరికొత్త ఫీచర్లతో 'జింప్'

జింప్.. ఫొటోషాప్‌కి ఏకైక ప్రత్యామ్నాయం. ఫొటో ఎడిటింగ్, డిజైనింగ్ విభాగాల్లో ఫొటోషాప్‌కి వున్న ప్రాధాన్యత, ప్రత్యేకత ఎవరూ విస్మరించలేనిది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు కలిగిన సాఫ్ట్‌వేర్ ఫొటోషాప్. ఫొటో ఎడిటింగ్, కలర్‌మేనేజ్‌మెంట్‌లో దీనికిదే సాటి. అయితే ఫొటో ఎడిటింగ్ ప్రపంచంలో ఫొటోషాప్‌కి ప్రత్యామ్నాయంగా ఎదిగిన ఒకేఒక్క సాఫ్ట్‌వేర్ జింప్. ఫొటోషాప్ మాదిరిగానే ఇది కూడా రాస్టర్ ఇమేజ్ ప్రోగ్రామ్. టూల్స్, లేయర్స్, ఫిల్టర్స్ మొత్తం ఫొటోషాప్‌ని జ్ఞప్తికి తెచ్చేవిధంగానే వుంటాయి. ఫిల్టర్స్‌లో మాత్రం ఫొటోషాప్ కంటే ఎక్కువ ఫీచర్స్ వున్నాయి. స్క్రిప్ట్-ఫ్యూలో వున్న అనేక ఆకర్షణీయమైన ప్యాటర్న్స్ దీని సొంతం. ఫొటో ఎడిటింగ్‌కి సంబంధించిన కలర్ బ్యాలెన్స్, బ్రైట్‌నెస్ & కాంట్రాస్ట్, లెవల్స్, కర్వ్స్, హ్యూ-సాచురేషన్ వంటి ఆప్షన్స్ అన్నీ కలర్ ఎడిటింగ్‌కి బాగా ఉపకరిస్తాయి. అంతేకాకుండా జింప్‌లో 48రకాల బ్రష్‌లు వున్నాయి. వాటిని అవసరానికి తగినట్టుగా మార్పులు చేసుకోవచ్చు.

ఫొటోషాప్ ఒక ప్రొప్రైటరీ సాఫ్ట్‌వేర్ అయితే... జింప్ ఫ్రీ సాఫ్ట్‌వేర్. ఫొటోషాప్ సిసి2014 వెర్షన్ 64బిట్, 32బిట్‌లో అందుబాటులో వుంది. అదే సందర్భంలో జింప్ 2.8.14 వెర్షన్‌తో తాజాగా ముస్తాబైంది. ప్రస్తుతం అందరికీ అందుబాటులో వున్నాయి. జింప్ పూర్తి పేరు "గ్నూ ఇమేజ్ మ్యానుప్యులేషన్ ప్రోగ్రామ్' (GNU Image Manipulation Program). దీనిని 1995లో స్పెన్సర్ కింబాల్ (Spencer Kimball), పీటర్ మాట్టిస్ (Peter Mattis) రూపొందించి 'గ్నూ జిపిఎల్' కింద అందరికీ అందుబాటులో వుంచారు. వీరితోపాటు మూడువేలకుపైగా ఔత్సాహికులైన సాంకేతిక నిపుణులు దీనిపై పనిచేస్తున్నారు. దీన్ని డౌన్లోడ్ చేసుకోవడం, అప్‌గ్రేడ్ చేసుకోవడం అంతా ఉచితం. జింప్‌లో టూల్స్, లేయర్స్, కలర్ మేనేజ్‌మెంట్ యూజర్ ఫ్రెండ్లీగా వుంటుంది. ఫొటోషాప్‌ను ప్రతి 12-18నెలలకొకసారి అప్‌గ్రేడ్ చేస్తుంటారు. అప్‌గ్రేడ్ అయిన ప్రతిసారీ మనమూ అప్‌గ్రేడ్ చేసుకోవాలంటే సుమారు 200డాలర్లు ఖర్చుపెట్టాల్సి వుంటుంది. జింప్‌తో ఆ సమస్యలేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఇది ప్రపంచవ్యాప్తంగా 52భాషలలో లభిస్తుండగా, 37భాషలలోకి పూర్తిగా అనువాదం చేశారు. మిగతా భాషలలో పాక్షికంగా అనువాదం జరుగుతోంది. జింప్‌లో సేవ్ చేసే ఫైల్స్ అన్నీ .xcf (eXperimental Computing Facility) ఫార్మెట్‌లో సేవ్ అవుతాయి. దీనిని నుండి మనకు కావాల్సిన ఫార్మెట్‌లోకి సేవ్‌యాజ్ చేసుకోవచ్చు. సాధారణంగా ఫొటోషాప్‌లో అయితే PSD





(Photoshop Document) లో సేవ్ అవుతాయి.

జింప్‌లో వాడుకొనేందుకు అనేక ప్లగిన్స్ అందుబాటులో వున్నాయి. జింప్ 2.8 వెర్షన్‌కి ముందున్న వెర్షన్‌లలో ఫొటోలను సిఎంవైకె కలర్స్‌లోకి కన్వర్ట్ చేసుకునే సౌలభ్యం కానీ, వెబ్‌పేజీలకు ఇమేజ్‌లను సేవ్ చేసుకునేందుకు ఉపయోగించే 'సేవ్ ఫర్ వెబ్' అనే ఆప్షన్స్ లేవు. 2.8వెర్షన్ నుండి వీటికి సంబంధించిన ప్లగిన్స్‌తో 'సెపరేట్' అనే సిఎంవైకె కన్వర్టర్‌ను అందుబాటులోకి తెచ్చారు. వీటిని http://registry.gimp.org/ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు. గత వెర్షన్లలో టూల్‌బార్, మెయిన్ విండో లేయర్ ఇతర ప్యాలెట్స్ విడివిడిగా వుండేవి. ఇవన్నీ కూడా ఒకే విండోలో వుండేవిధంగా ప్రస్తుత తాజా వెర్షన్‌లో ఏర్పాటు చేశారు. అదే విధంగా http://gimpscripts.com/ నుంచి స్క్రిప్ట్స్, ప్లగిన్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటిని ఏవిధంగా వాడుకోవాలో కూడా ఈ వెబ్‌సైట్‌లో స్క్రీన్‌షాట్స్‌తో సహా వివరంగా వుంటుంది. అయితే దీనిలోనూ కొన్ని లోపాలున్నాయి. డైరెక్ట్‌గా సిఎంవైకె ఫీచర్ లేకపోవడం, టెక్స్ట్ లేయర్‌ను ఎడిట్ చేయలేకపోవడం వంటి కొన్ని లోపాలున్నాయి. దీనిపై జింప్ కన్సార్టియం ఎప్పటికప్పుడు రీసెర్చ్ చేస్తూనేవుంది. 2.10వెర్షన్ త్వరలో వస్తుందని ఇప్పటికే ప్రకటించారు. దీనిలో మరికొన్ని మార్పులు చేర్పులతో పాటు అడ్వాన్స్ ఫీచర్స్‌ను పరిచయం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అయితే ప్రతి ఒక్కరికీ వచ్చే సందేహం ఒక్కటే. జింప్‌లో ఇన్ని ఫీచర్స్ వుండి, ఇంత యూజర్ ఫ్రెండ్లీ అయితే ఫొటోషాప్ మాదిరిగా ఎందుకు పాపులర్ కాలేదని. అయితే జింప్ ఉచిత సాఫ్ట్‌వేర్ కావడం వల్లనే రావాల్సినంత ప్రచారం రాలేదనేది దీనిగురించి తెలిసినవారు చెప్పేమాట. ఇంటర్నెట్ బాగా అందుబాటులోకి వచ్చిన తర్వాతనే జింప్ పాపులర్ అయింది. జింప్ వినియోగదారులకు సహాయపడేదుకు అనేక ఫోరమ్స్ (http://registry.gimp.org/forum) వున్నాయి. ఆ ఫోరమ్స్‌నుండి సాంకేతిక సహకారం కూడా పొందొచ్చు. దీన్ని http://www.gimp.org/downloads/ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు. జింప్‌కు సంబంధించిన అనేక వీడియోలు 'యూట్యూబ్'లో కూడా అందుబాటులో వున్నాయి. ఫొటోషాప్‌కు ప్రత్యామ్నాయంగా జింప్‌ను వాడటం వల్లనే బోల్డంత ఖర్చు తగ్గించుకోవచ్చు. ఇక మీదే ఆలస్యం...

- రచయిత సెల్ : 9490099219

నరహరికి 30 సంవత్సరాలు. అందమైన అమ్మాయితో పెళ్ళయింది. ఇతరత్రా ఎలాంటి బాధలు, ఆర్థిక ఇబ్బందులు లేకపోవడంతో శృంగార జీవితాన్ని బాగా ఎంజాయ్ చేశాడు. ఆరు నెలలు ఆరు రోజుల్లా గడిచిపోయాయి. కానీ ఒకరోజు పడక గదిలో వైఫల్యం. ఎంత ప్రయత్నించినా అంగస్తంభన కాలేదు. అనుకోకుండా వచ్చిన మార్పు ఎందుకో అర్థం కాలేదు. రోజూ రెండు మూడు సార్లు శృంగారంలో పాల్గొనే తను ఇప్పుడు రెండు, మూడు రోజులకు ఒకసారి కూడా భర్యతో గడపడంలేదు. భార్యనోరు తెరచి ఏమీ అడగకపోయినా సుఖాన్ని అందించకలేకపోతున్నాననే బాధ రోజురోజుకి పెరగసాగింది. భార్య ప్రేరేపించినా మధ్యలోనే అంగం మెత్తబడిపోతోంది. శృంగారంలో పాల్గొనాలనే కోరిక ఉన్నా సాధ్యం కావడం లేదు. దాంపత్య జీవితానికి ఇక పనికిరానేమో అని భావించిన ఒక సారి డాక్టర్‌ని కలిసి పరిస్థితిని వివరిద్దామని నిర్ణయించుకుని నా దగ్గరకు వచ్చారు. ఎంతో ఆవేదనతో తన బాధనంతా చెప్పుకొచ్చారు. అతడు అడిగిన మొదటి ప్రశ్న అంగస్తంభన సమస్య ఎందుకు తలెత్తుతుంది?

ఆ సమస్యకు ఆదిలోనే చెక్

కారణాలు అనేకం

మానసిక ఒత్తిడి, అధిక శారీరక శ్రమ, మానసిక ఆందోళన వంటివి ఈ సమస్యకు ముఖ్యకారణాలుగా చెప్పుకోవచ్చు. మానసిక ఆందోళనతో లేదా శరీరక ఒత్తిడితో వచ్చే సమస్యలను చాలా వరకు మంచి వైద్యునితో కౌన్సెలింగ్ చేయించుకోవడం ద్వారా తగ్గించుకోవచ్చు. సరియైన నిద్రతో చాలా వరకు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. మంచి నిద్రతో అలసట, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. దీని వల్ల శరీరంలో లైంగికపరమైన కోరికలు పెరుగుతాయి. శృంగార జీవితానికి మంచి మనసు, మంచి ఆహారం దోహదపడతాయి. శృంగారానికి ముందు మంచి ఆలోచనతో, మంచి మూడ్‌తో ప్రేరేపిస్తే అసలు సమస్య రావడం జరగదు. దంపతులు మూడ్‌ను పెంచే చిన్న చిన్న పనులతో మొదలు పెట్టాలి. దీంతో ఇద్దరికీ తెలియని ఉద్రేకం మొదలవుతుంది. అలాకాకుండా సరియైన వాతావరణం, పరస్పర ఆకర్షణ లేని పక్షంలో మూడ్‌లో మార్పులు వచ్చి అంగస్తంభన వైఫల్యం జరుగుతుంది. శృంగారం విషయంలో స్త్రీ, పురుషుల మధ్య సరియైన ఆకర్షణ లేకపోతే లైంగిక సమస్యలు తలెత్తుతాయి. అలాకాకుండా తన భాగస్వామిలో ఆసక్తి లేకపోయినా శృంగార జీవితంలో సమస్యలు ఎదురవుతాయి. ఒకవేళ స్త్రీ నుంచి సరియైన ప్రేరణ, కోరిక లేకపోయినా తన నిర్లిప్తత వల్ల పురుషునిలో ఒక రకమైన నిరాశావాదం ఏర్పడి సరియైన రీతిలో స్పందనలు కలగకపోవడం వల్ల అంగస్తంభన వైఫల్యం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో స్త్రీలలో కామవాంఛ అధికంగా ఉండటం జరుగుతుంది. దీనివల్ల తను భర్తనుంచి పరిపూర్ణమైన శృంగారజీవితాన్ని ఆశిస్తుంది. శృంగారంలో వివిధ భంగిమలను, వివిధ ప్రేరణలను ఆశించడం జరుగుతుంది. అతిగా ఆసక్తి చూపుతున్న స్త్రీని చూచి మగవాడిలో ఒకరకమైన భయం ఏర్పడుతుంది. దీనివల్ల అతనిలో సరియైన సెక్స్ సుఖం ఇవ్వలేకపోతున్నామనే అనుమానం ఏర్పడుతుంది. ఆ అనుమానం తన లైంగిక శక్తిపైన పడి అంగవైఫల్యానికి దారితీస్తుంది. దీనివల్ల సరియైన నిద్ర లేక పోవడం అలసట, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు మరింత ఎక్కువై చాలా సార్లు అంగస్తంభన సమస్యతో సతమతమవుతారు. పని ఒత్తిడి వల్ల చాలా మంది యువకులలో లైంగిక కోరికలు తగ్గిపోతున్నాయి. వ్యాపారాలు, కాల్ సెంటర్లలో పనిచేసే వాళ్ళు, రాత్రిళ్లు ఉద్యోగాలు చేసే వారిలో తెలియకుండా మానసిక ఒత్తిడితో అంగస్తంభన వైఫల్యం జరుగుతోంది.

అనాసక్తి కారణమే

మధ్య వయస్కుల్లో అప్పుడప్పుడు అంగస్తంభన వైఫల్యం జరగడం సాధారణంగా కనిపిస్తుంది. లైంగికపరమైన కోరికలు తగ్గినట్లుగా అనిపిస్తాయి. జీవన విధానంలో మార్పులు సెక్స్ సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. కొందరిలో 50 నుంచి 60 సంవత్సరాల మధ్యలో శృంగారంపైన ఒకరకమైన అనాసక్తి ఏర్పడుతుంది. దీనివల్ల తరచుగా అంగస్తంభన వైఫల్యం జరుగుతుంది. దీనికి కారణం పరస్పర ఆకర్షణ తగ్గడం. యాంత్రికంగా మారిన లైంగిక జీవితం వల్ల అంగస్తంభన వైఫల్యం జరుగుతుంది. కొంతమంది ఆల్కహాల్ తీసుకోవడం వల్ల లైంగిక సామర్థ్యం పెరుగుతుందని భావిస్తారు. మొదట్లో అలా అనిపించినా తరువాత సమస్య మరింత తీవ్రమవుతుంది. మద్యపానం అధికంగా తీసుకోవడం వల్ల టెస్టోస్టిరాన్ హార్మోన్ లెవెల్ తగ్గడం జరుగుతుంది. ఆల్కోలిక్ న్యూరైటిక్ వల్ల చాలా మందిలో అంగస్తంభన సమస్య కనిపిస్తోంది. కొన్ని సార్లు అంగం బాగా స్తంభించాలనే ఆరాటంతో మరింత వైఫల్యం చెందుతారు. డయాబెటిస్ ఉన్న

డా॥మధు వారణాశి ఎం.డి
ప్రముఖ హోమియో వైద్య నిపుణులు
ప్లాట్ నెం.188,
వివేకానంద నగర్ కాలనీ
కూకట్‌పల్లి, హైదరాబాద్.
ఫోన్ : 8897331110,
8886509509

వారిలో అంగస్తంభన వైఫల్యం చెందుతారు. డయాబెటిస్ ఉన్న వారిలో అంగస్తంభన వైఫల్యం ఎక్కువగా కనిపిస్తుంది. మధుమేహం ఉన్న వారిలో రక్త ప్రసరణ సమస్యలు ఏర్పడి అంగానికి తగినంత రక్తసరఫరా జరగక అంగస్తంభన జరగదు, రక్తపోటు, ఉబ్బసం, గుండె జబ్బులు, సయాటిక సమస్యలతో బాధపడేవారిలో చాలామందిలో ఈ సమస్య కనపడుతుంది. కొన్ని రకాల మందులు వాడటం వల్ల, స్టెరాయిడ్ వాడటం వల్ల, డిప్రెషన్‌కు వాడే మందులు వల్ల అంగస్తంభన సమస్యలు తలెత్తుతాయి. టెస్టోస్టిరాన్ హార్మోన్ తగ్గడం వల్ల కూడా అంగస్తంభనలో వైఫల్యం ఉంటుంది. అధిక బరువు ఉన్నవారిలో ఈ సమస్య కనిపిస్తుంది. పొగతాగే అలవాటు ఉన్నవారిలో రక్తప్రసరణ సమస్యలతో లైంగిక కోరికలు తగ్గి శృంగార జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు.

వ్యాధి నిర్ధారణ

ముందుగా శారీరక, మానసిక లక్షణాలను పరిశీలించాలి. లైంగిక జీవితం గురించిన పూర్తి సమాచారం రాబట్టాలి. పినైల్ డాప్లర్ స్టడీ, టెస్టోస్టిరాన్ లెవెల్స్, టీఎస్‌హెచ్, బ్లడ్‌షుగర్ లెవెల్స్, ప్రొస్టేట్ ఎగ్జామినేషన్‌లాంటి పరీక్షలతో అంగస్తంభన వైఫల్యాలను గుర్తించవచ్చు.

చికిత్స

లైంగిక సమస్యలను దూరం చేసే ఔషధాలు హోమియోలో చాలా ఉన్నాయి. లైంగిక సమస్యలకు ముఖ్యంగా అంగస్తంభన వైఫల్యం, శీఘ్రస్ఖలనం వంటి సమస్యలకు హోమియో మందులు వరప్రసాదంగా పనిచేస్తాయనడంలో అతిశయోక్తి లేదు. ఇది చాలా సున్నితమైన అంశం. రోగి బలహీనతలపైన ఆధారపడి ఉంది. సరియైన వైద్యుని పర్యవేక్షణలో చర్చించి మందులు వాడితే లైంగిక జీవితం ఎంతో హాయిగా ఉంటుంది. శారీరక, మానసిక లక్షణాలపై ఆధారపడి చికిత్స చేస్తే ఎలాంటి సమస్య అయినా దూరమవుతుంది. సరియైన చికిత్సతో పాటు సరియైన ఆహారం తీసుకుంటే అంగస్తంభన సమస్య నుంచి సులువుగా బయటపడవచ్చని వివరించడంతో నరహరిలో ఎంతో ధైర్యం వచ్చింది. కొన్ని నెలలు చికిత్స తీసుకున్నాడు. ఇప్పుడు నరహరి శృంగార జీవితం హాయిగా సాగిపోతోంది.

*

ఈతరానికి అవసరమైన రచన

జీవించు-నేర్చుకో-అందించు (బెస్ట్ కొటేషన్స్)
రచన: తుమ్మేటి రఘోత్తమరెడ్డి
పేజీలు: 200, వెల: రూ. 300
ప్రతులకు: పుల్లూరు దయాకరరావు,
స్రవంతి జూనియర్ కాలేజీ, జమ్మికుంట,
98661 96168

అల్పాక్షరాల్లో అనల్ప అర్థాన్ని ఇవ్వడం సాహిత్యంలో మేలిమి అంశం. కొటేషన్స్‌ను కూడా ఒక సాహిత్యప్రక్రియగా అభివృద్ధి చేసి పాఠకులల్లోకి తీసుకెళ్ళడం ఆహ్వానించదగిన అంశం. ఈ పనిని చేస్తున్నారు ప్రముఖ కథా రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి. 'జీవించు-నేర్చుకో-అందించు' శీర్షిక ద్వారా గతంలో ఒక పుస్తకం తీసుకొచ్చారు. ఇప్పుడు రెండవ సంపుటం వెలువరించారు. దీనిలో 613 అంశాల మీద 3500 కొటేషన్స్ వున్నాయి. 'ఆధునిక తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి స్వతంత్ర కొటేషన్స్' అని పుస్తకానికి ట్యాగ్‌లైన్ ఇచ్చారు. అంటే ఇవి ఆంగ్లంలో వున్న కొటేషన్స్‌కు అనువాదాలు కాదన్నది స్పష్టం. రచయిత అనుభవం, అధ్యయనం, స్వతంత్ర ఆలోచనల్లోంచి రూపుదిద్దుకొన్నవి.

అయిదారేళ్ళుగా రఘోత్తమ్ ఈ కొటేషన్స్‌ను రచించడంలోనే నిమగ్నమయ్యారు. చాలా విషయాల పట్ల యువకులకు, పెద్దలకు సరైన అవగాహన కల్పించే కొటేషన్స్‌ను రాస్తున్నారు. సాధారణంగా కనిపించే అంశాల్లో ఉండే మహత్తును, వైచిత్రిని వీటిలో చూపిస్తున్నారు. ఆరాధన, అనురాగం, ప్రేమ, పెళ్ళి, వ్యక్తిత్వవికాసం, ఏకాంతం, ఏకాగ్రత, ఆహారం, అంతరంగం, హక్కులు, స్త్రీ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, బాల్యం, ప్రకృతి, పుస్తకాలు, శీలం, శృంగారం, సమాచారం, సినిమా, హాస్యం వంటి అనేకానేక అంశాల మీద రచయిత రాసిన కొటేషన్స్ విస్మయం కలిగిస్తాయి.

పాఠకుల మనోవికాసానికి తోడ్పడే కొటేషన్స్. వాక్యనిర్మాణంలో ఎలాంటి సంక్లిష్టత లేదు. అచ్చు తప్పులు లేకుండా, అన్వయ క్లిష్టత లేకుండా, చాలా సూటిగా, పదునుగా ఉండే వాక్య నిర్మాణం దీనిలోని ప్రధాన ఆకర్షణ. చిన్న చిన్న వాక్యాల్లో మనసు మెచ్చేరీతిన చెప్పిన కొటేషన్స్ ఇవి. నిజంగానే ఇది ఒక స్వతంత్ర రచన. వాక్యాల్లో సృజనాత్మకమైన సొగసుదనం ఉంది. చాలా కొటేషన్స్‌ను మనం ఇంట్లో తలుపుల మీద, కిటికీల దగ్గర, టేబుల్స్ మీద పెట్టుకోవచ్చు. చదవగానే ఒక ఉత్తేజం, ఉద్దీపన ఇచ్చే శక్తి రఘోత్తమ్ కొటేషన్స్‌లో వుంది.

ఒక సాహిత్యప్రక్రియగా ఈ కొటేషన్స్ చేసే ఉపకారం ఏమిటో గొల్లపూడి మారుతిరావు, బి.ఎస్.రాములు, జాన్‌సన్ చోరగుడి, ముళ్లపూడి సుబ్బారావు, తాయమ్మ కరుణ ముందుమాటలు వివరిస్తాయి. ఈ కొటేషన్స్‌లో వుండే పరిమళాన్ని, సత్యసంధతను ముందుమాటల రచయితలు సరిగ్గా వివరించగలిగారు. ఈ పుస్తకాన్ని చదివే పాఠకులు ఈ ముందుమాటలు కూడా చదవడం మంచిది.

ఈ పుస్తకంలో పరమసత్యాలుగా అనిపించే కొటేషన్స్ కొన్నిటిని చదివినప్పుడు విస్తుపోతాం. అయితే కొన్ని అంశాల మీద ఇచ్చిన కొటేషన్స్‌లో వైరుధ్యాలు లేకపోలేదు. ఉదాహరణకు 'అధికారం' అనే అంశం మీద ఇచ్చిన కొటేషన్స్‌లో వైరుధ్యాలున్నాయి.

కొటేషన్ 74: అధికారంలోకి జ్ఞానులు వెళ్లరు - అధికారుల్లో జ్ఞానం ఉండదు, 81: అధికారమంటే, ప్రజాధనాన్ని తన వర్గానికి మేపేదని అర్థం, కొటేషన్ 86: అధికారం దానంతటదే చెడ్డది కాదు, మనుషులు మాత్రమే అధికారాన్ని చెడగొడతారు.

ఈ మూడు కొటేషన్స్‌లోనే వైరుధ్యాలు కనిపిస్తున్నాయి. ఈ మూడూ రఘోత్తమరెడ్డి ఇస్తున్న స్టేట్‌మెంట్స్. అధికారుల్లో జ్ఞానులు ఉండరని ఎలా తీర్మానిస్తారు? తన వర్గాన్ని మేపడానికే అధికారమయితే, దానంతటది చెడ్డది కాకుండా ఎలా పోతుంది?

అలాగే 'బహుమతి' అనే అంశంపై ఇచ్చిన కొటేషన్లలోనూ వైరుధ్యాలున్నాయి.

2369 కొటేషన్: నీ పని నువ్వు చేస్తూ వెళ్లు, వెనుక బహుమతి వస్తే రానీ. 2371 కొటేషన్: ప్రభుత్వ బహుమానాలన్నీ అనర్హులకే అందుతాయి.

ఈ రెండు కొటేషన్స్‌లోనూ వైరుధ్యాలున్నాయి. తన పని తాను చేసుకువెళ్ళే రచయితకు అవార్డు లేదా బహుమతి వస్తే మంచిదే అనేది మొదటి కొటేషన్ అర్థంగా భావిస్తే, ఒకవేళ ప్రభుత్వ బహుమతి ఆ రచయిత అందుకుంటే అనర్హుడవుతాడా? ఇక్కడ వైరుధ్యం లేదా? ఈ విషయాన్ని రఘోత్తమ్ ఆలోచించాలి. ప్రభుత్వ బహుమానాలన్నీ అనర్హులకే అందుతాయనే మాట అన్యాయంగా తోచడం లేదా? అనర్హులకు ఎక్కువగా అందుతున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. నిజానికి అనర్హులకు ఇచ్చే వాటికి సంబద్ధత కల్పించడానికి కొన్నిసార్లు అర్హులకు కూడా బహుమతులు, పురస్కారాలు అందిస్తారు. ఈ సంగతి రఘోత్తమ్‌కి తెలియనిది కాదు.

అక్కడక్కడ ఇలాంటి వైరుధ్యాలున్నాయి. వీటిని మినహాయిస్తే అనేకానేక అంశాల మీద ఇచ్చిన కొటేషన్స్ పాఠకుల చైతన్యాన్ని ఇనుమడింపజేస్తాయి. వివిధ అంశాల మీద సరైన అవగాహన అందిస్తాయి. కుటుంబంలో ఉండే తల్లిదండ్రులు, పిల్లలు నిత్యమూ, నిరంతరమూ ఈ పుస్తకం చదవాలి. అలాగే ప్రతి ఇంటా, ప్రతి లైబ్రరీలో, ప్రతి ఆఫీసులో ఈ పుస్తకం ఉండాలి. రచయిత ఈ సాహిత్యరచన ఇలాగే కొనసాగించడం ఈ కాలపు అవసరం.

- గుడిపాటి

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటీ రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-500030.

పిల్లలపై ప్రేమతో ప్రయోగాలు



గిజుభాయి పగటి కల, పేజీలు: 112,
వెల:40/-, ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

పిల్లలు భయమన్నది తెలియకుండా బడికి వెళ్ళాలని ఆరాటపడేలా బడి వుండాలి. అలాంటి బడిని గురించి, చదువుల గురించి గిజుభాయి బధేకా ఆలోచనల సమాహారం 'పగటికల'. పిల్లల చదువుల మీద ప్రేమను, శ్రద్ధాసక్తులను చూపే తల్లిదండ్రులు చదవాల్సిన పుస్తకమిది. ఈ పుస్తకం గుజరాతీలో దివాస్వప్న రచించగా, ఎ.జి.యతిరాజులు తెలుగులోకి అనువాదం చేశారు. పాఠశాల విద్యలో ప్రయోగాల గురించి వివరంగా రాశారు. విద్యారంగంలో పిల్లల బుద్ధికి పదును పెట్టేలా చదువులుండాలి.అలాంటప్పుడు బడి ఎలా ఉండాలో గిజుభాయి చెబుతారు. వారి ఆలోచనల, ప్రయోగాల, అనుభవాల సమాహారం ఈ పుస్తకం. ఉపాధ్యాయుల దృక్పథంలో ఎలాంటి మార్పులు రావాలో, పిల్లల్ని ఎంత ప్రేమగా చూసుకొని తగిన మార్గదర్శకత్వం వహించాలో చెబుతారు. అందుకే పిల్లల మీద ప్రేమ వున్న వారు, శిశు హృదయంతో లోకాన్ని పరికించేవారు ఈ పుస్తకం చదవాలి. అయిదు అధ్యాయాలున్న ఈ పుస్తకం సరళమైన శైలిలో వుండి చదివిస్తుంది.

అక్కడి చదువులపై అవగాహన



సింగపూర్ చదువులు - చుక్కా రామయ్య
పేజీలు: 48, వెల: రూ. 35,
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య గారి నిశిత పరిశీలనా దృష్టికి నిదర్శనంగా నిలిచే వ్యాసాల సంపుటి 'సింగపూర్ చదువులు'. సింగపూర్‌లో పర్యటించిన రామయ్య గారు అక్కడి చదువుల తీరుతెన్నుల్ని పరిశీలించారు. అక్కడి సమాజాన్ని, పాలనను, ప్రజల నడవడికను, మరీ ముఖ్యంగా చదువుల ధోరణిని గమనించారు. అధ్యయనం చేశారు. విద్యావిధానం ఎంత ఉపయోగకరంగా ఉండాలో ఆకళింపు చేసుకున్నారు. వారి అవగాహనా విస్తృతి, దృక్పథంలోని వైశాల్యం 'సింగపూర్ చదువులు' పుస్తకంలోని వ్యాసాలు తెలియజేస్తాయి. ఈ పుస్తకంలో పన్నెండు వ్యాసాలున్నాయి. సింగపూర్ అభివృద్ధి గురించి చెబుతున్న మాటల వెనుక వున్న అసలు అంశాల్ని వివరించారు రామయ్య గారు. చదువు పునాదిగా కొనసాగుతున్న అభివృద్ధి కోణాల్ని చూపారు. విలువలు లేని చదువుల గురించి హెచ్చరించారు. అభివృద్ధికి మానవశ్రేయస్సు ప్రధానం కావాలన్న ఆలోచనలు చేశారు. ఆ ఆలోచనలు ఆచరణ మార్గం పెట్టడమెలాగో తన పుస్తకాల్లో వివరించారు రామయ్య గారు.

రామయ్య గారి వ్యాసాల పరంపరలో విలువైన అంశాలతో కూడిన గ్రంథంగా పేరొందిన పుస్తకమిది. అభివృద్ధికి ప్రమాణంగా సింగపూర్‌ని తీసుకుంటే దాని చీకటివెలుగులు రెండూ తెలుస్తాయి. వాటిని తెలుసుకోడానికి సిద్ధపడాలన్న అంశం అంతర్లీనంగా దాగి వుంటుంది. ఈ కారణంగానే 'సింగపూర్ చదువులు' శీర్షికన రామయ్య గారు వ్యాసాలు రాయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

వైరుధ్యాల్ని చర్చకు పెట్టిన కథలు

సంపెంగ పూదండ (కథలు)
రచన: శివకౌముదీ దేవి
ప్రచురణ: తెలంగాణ సాహితి పబ్లికేషన్స్
పేజీలు: 136, వెల: రూ. 75.
ప్రతులకు: విశాలాంధ్ర,
ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు



సమకాలీన జీవితంలోని పలు అంశాల్ని చర్చకు పెట్టే కథలు రాశారు ముదిగొండ శివకౌముదీ దేవి. ఆమె కథల పుస్తకం 'సంపెంగ పూదండ'లో మొత్తం పద్దెనిమిది కథలున్నాయి. శీర్షికల్లోనే ఆకర్షణ వుంది. 'పూర్ణాత్ పూర్ణముదస్యతే' కథలో చర్చించిన అంశాలు ఆసక్తికరంగా ఉన్నాయి. స్త్రీవాదాన్ని, చలం పుస్తకాలని ప్రస్తావించారు. జీవితంలో మనిషికి అసలు ఏం కావాలన్న అంశంపై చర్చ నడిచింది. అలాగే 'ఋతుమోహం' కథలోనూ స్త్రీ పురుష సంబంధాల్లోని వైరుధ్యాల్ని విశ్లేషించారు. పరిణతి చెందిన పాత్రలు ఉండడం వల్ల సాహిత్యం, కవిత్వం, సామాజిక విషయాలు, అనువాదాలు, శ్రీశ్రీ, తిలక్, బైరాగి వంటి కవుల పేర్లు కథలో ప్రస్తావనకు వచ్చాయి. సాహిత్యపరమైన అభిరుచులున్నవారు ఈ కథని ఇష్టపడతారు.

'సముద్రం, అలలపై అక్షరాలు, శత్రు మైత్రి, ఐస్, శతాబ్ది కుందులు, పొద్దు తిరుగుడు పువ్వు, బొమ్మ రాగిచెంబు, తాతయ్య కొనిపెట్టిన బొమ్మ' వంటి కథలు మానవ జీవితంలోని సంక్లిష్టతలను అభివ్యక్తం చేశాయి. పాత్రల చైతన్యస్థాయిని బట్టి రచయిత్రి ఏం చెబుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన కె.బి.లక్ష్మి చెప్పినట్టు ప్రకృతిని, మానవ ప్రవృత్తుల్ని సున్నితంగా, పదునుగా విశ్లేషించే కథనం ఈ రచయిత్రి ప్రత్యేకత. చాలా కథల్లో మనుషుల ఆలోచనల తీరుతెన్నులను ఆసక్తికరమైన రీతిలో లేవనెత్తారు. కథలకు ప్రేరణ, నేపథ్యం లాంటి అంశాల్ని రచయిత్రి తన ముందుమాటలో రాశారు. కనుక ఈ కథల్ని అర్థం చేసుకోడం పాఠకులకు మరింత సులువైంది. మొత్తమ్మీద సామాజిక జీవనంలోని పలు వాస్తవాలు, వైరుధ్యాలు ఈ కథల్లో చిత్రితమై ఆలోచింపజేస్తాయి.

- అశోక్‌కుమార్

గమనిక

➠ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➠ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➠ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500030.

■ ఈ వారం కవిత్వం

అమూర్తుడు



ఆ పసిగుడ్డుని
పాతికేళ్లుగా చూస్తున్నాను
మండుటెడారిలో నాటిన విత్తులా
అతి నెమ్మదిగా యెదుగుతున్న శరీరం
వసంతం వచ్చినా చిరునవ్వు పువ్వు పూయదు
శిశిరం పలకరింపులోని రహస్యమూ తెలియదు
తనదేట, తన లోకమేదో వేరన్నట్టు
ఎవరినీ పలకరించింది లేదు
ఎవరితోనూ మాటాడింది లేదు.
అంతర్ముఖుడూ కాదు, ఆంతర్యమూ తెలియదు
మనసెదగని పసిబిడ్డ
పాతికేళ్ల మొక్కగానే వుంది
సాటి దూడలన్నీ ఎదిగి
కాలం నాగలిని భుజాలపై మోస్తూ
బతుకు పొలం దున్నుతున్నా
తనకు కాలమూ తెలియదు
కాడీ తెలియదు
వర్ణార్ణవ సింఫనీ గీతం తెలియదు
పున్నమి వెన్నెల చల్లదనమైనా
మండు వేసవి వుక్కపోతైనా
క్షితిజరేఖ పైన వుదయించే కాంతి కిరణమైనా
ఏదీ తెలియని అమాయకత్వం
ఇంటి అరుగుపైన
వొంటరి బొడ్రాయిలా కూచున్న వాణ్ణి
బడికెళ్లే పిల్లలంతా
గిచ్చుతూ, గిల్లుతూ ఆట పట్టిస్తూ
అల్లరల్లరి చేస్తున్నా
ఆ నోరు తెరచిందీ లేదు
ఆ చేయి ఎత్తిందీ లేదు
గాలి వీచని చెట్టులా మౌనంగా వుంటుంది
వేయి పిడికిళ్ల వొకటిగా చేరి
గుండెల్ని పట్టి పిండేస్తున్నా
మనసు గాయాన్ని విడమర్చదు
రాత్రి కురిసిన మంచురవ్వల వర్షానికి
తడారని రేకల్లాంటి కళ్లతో
అమాయకంగా వీక్షిస్తుంది అందర్నీ
అవసరానికి అందిరాని కొడుక్కీ
పుట్టలోని చెదలుకీ
సామ్యం చెప్పి వెళ్తున్న తండ్రి
చస్తే పంపకాల్లో
వాటా తగ్గుతుందనుకొనే తమ్ముళ్లు
అందరిలో ఏదో వొక అవిటితనం
కొందరికి బాహికంగా
కొందరికి ఆంతరింగికంగా
సాయంకాలపు మౌనగీతం ఆలపిస్తూ
ఆకాశం జారుడుబండ మీది నుండి
పడమటికి వాలిపోతున్న సూరుయడిలా
అతను వుదయమూ అంతే
ప్రతి సాయంత్రమూ అంతే!

- ఈతకోట సుబ్బారావు

ప్రశ్నలంటే?

ఎప్పుడెలా పుట్టిందో గాని
ఏమిటి? ఎందుకు? ఎలా? అనే
ప్రశ్నలే లేకుంటే ఎలా ఉండేదో
మన ప్రపంచం
ఊహకే అందకుండా ఉంది
ప్రశ్నతోనే ప్రగతి
ముందుకు సాగుతోంది ఈ జగతి
ప్రశ్నలంటే భయమెందుకు?
ప్రశ్నించడానికి సంశయమెందుకు?
అందుకే ప్రశ్నలను
స్వాగతించు
ప్రశ్నించడాన్ని ప్రోత్సహించు
ప్రగతి పథంలో పయనించు

- సమ్మెట గోవర్ధన్,
9949038471

క్రిస్మస్ వచ్చేస్తోంది. ఈ పండుగ అనగానే ముందుగా గుర్తొచ్చేది క్రిస్మస్ చెట్లే. పోటీగా ఒకదానికంటే మరొకటి పెద్దగా, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించే క్రిస్మస్ ట్రీలు ఎంతో అందంగా ఆకర్షిస్తాయి. వివిధ దేశాల్లోని ఏర్పాటయిన క్రిస్మస్ ట్రీలు...



ప్రకృతి అందాలను ప్రతిబింబిస్తున్న ఈ దృశ్యం సార్‌నదిలోని ఓ భాగం. ఈ నది జర్మనీ, ఫ్రాన్స్‌లలో ప్రవహిస్తుంది. యు షేప్‌లో ఉన్న ఈ భాగం పేరు సార్‌లూప్.